# విజయమునకు ఉన్నత మార్గము

భక్త్ సింగ్

ఏడవ ముద్రణ : ఆగష్టు 2000; 3000 ప్రతులు

పుస్తకములు కావలసినవారు
ఈ క్రింది అడ్రస్‌కు వ్రాయమనవి

"హెబ్రోను"
గోల్కొండ చౌరస్తా
హైదరాబాద్ - 500 020 (ఆం.ప్ర.)

---

ముద్రణ :
ఎస్. ఎస్. గ్రాఫిక్స్
నల్లకుంట, హైదరాబాద్

# విషయ సూచిక


| | | | పుట |
|---|---|---|---|
| 1. | విజయమునకు మెట్లు | ... | 1 |
| 2. | దేవుని సహాయము | ... | 4 |
| 3. | విశ్వాసుల సహవాసము | ... | 8 |
| 4. | సద్భక్తి వలన శ్రమ | ... | 11 |
| 5. | ప్రభువు సేవలో శ్రమ | ... | 12 |
| 6. | దేవుని వాగ్దానము | ... | 15 |
| 7. | కన్నీటితో కూడిన పంట | ... | 23 |
| 8. | సంఘ నిర్మాణము | ... | 27 |
| 9. | సంఘ శ్రమ | ... | 33 |
| 10. | సంఘ నిర్మాణము - శ్రమ | ... | 34 |
| 11. | ప్రభువు కొరకు కనిపెట్టు | ... | 38 |
| 12. | దీనత్వము | ... | 39 |
| 13. | పరలోకపు ఏర్పాటు లోనికి వచ్చుట | ... | 41 |
| 14. | దేవుని సంపూర్ణత | ... | 54 |
| 15. | ఆరాధన | ... | 55 |

# ఉపోద్ఘాతము

మేడమీదకు వెళ్ళవలయుననినను లేక ఒక అంతస్థు నుండి మరియొక అంతస్థునకు వెళ్ళవలయుననినను మెట్లు ఎక్కుట అవసరము. దేవుడనుగ్రహించిన రక్షణలో నెదుగుట కూడ మన ప్రభువైన యేసుతో ఆత్మీయముగా ఒక్కొక్క అడుగు ముందుకు వేయుచు పైకి నడచుటయే. ప్రారంభములో ఒక్క అడుగు మాత్రమే వేయుదుము. పిమ్మట కాలము గడచు కొలది ఒక్కొక్క మెట్టు దాటుచు వెళ్ళెదము. కొందరు బాలురు రెండు మూడు మెట్లు ఒకేసారి దాటవలయునని ప్రయత్నించెదరు. అట్లు దుముకుట ద్వారా ఒక్కొక్కప్పుడు జారి క్రింద పడెదరు. దెబ్బలు కూడ తగులును. రక్షణ శిఖరములకు వెళ్ళునప్పుడు కూడ యిట్లే జరుగును. ఒకసారి ఒక అడుగు మాత్రమే వేయుటకు జాగ్రత్తపడవలెను. మొదటి అడుగు నూతనముగా జన్మించుటయే అనగా యేసుక్రీస్తు ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించుటయే తరువాత వేయవలసిన అడుగును పరిశుద్ధాత్మ చూపించును. ఈ రీతిగా మన ఆత్మీయ ఎదుగుదలలో ప్రభువుతో ఎడతెగని సహవాసమును అనుభవించుదుము.

# విజయమునకు మెట్లు

## I. క్రీస్తునందు నూతన సృష్టి

ఆరోహణ కీర్తనలలో 120వ కీర్తన మొదటిది. పతన మార్గములో నుండి నాశనమునకు సమీపించు దుర్గతిలో నున్న సమయములో మన దుస్థితిని గ్రహించి, సహాయమునకై ఎట్లు మొరపెట్టుదుమో ఈ కీర్తన వివరించుచున్నది. " నా శ్రమలో నేను యెహోవాకు మొఱ్ఱపెట్టితిని. ఆయన నాకు ఉత్తరమిచ్చెను." (కీర్త. 120:1). పరలోకమునకు వెళ్ళు ఉన్నత మార్గములోని మొదటి మెట్టు యిదే - అనగా ప్రభువుతో మన నడక ప్రారంభించుట, ప్రభువుతో సంబంధము లేకుండనే మన పనులు మనము జరిపించుకోగలమని సంవత్సరము తరబడి మన మనుకొంటిమి. మన ప్రభువు లేకపోయినను, మన జీవితమును మన తెలివి, మన సామర్థ్యములతో మనమే నిర్వహించుకొనగలమనే ధీమాతో గడిపితిమి. దేవుని సహాయము కొరకు దేవునికి మొఱ్ఱ పెట్టవలెనని యోచించకపోతిమి. కనుకనే అనేక సార్లు మన ప్రయత్నము లన్నియు అధోగతిపాలగును. మన ప్రయత్నములన్నియు విఫలమై, దౌర్భాగ్యులమైనప్పుడే, దేవుని సహాయము లేని మన జీవితములు శిథిలమగుననియు, ఇహ, పరలోకములలో ఎట్టి నిరీక్షణ యుండదనియు గ్రహించెదము. ఈ రీతిగా అనేకులు ఏ దుర్గతి ద్వారానో అనగా విపరీతమైన వ్యాధి ద్వారానో లేక దారుణమైన దారిద్ర్యము ద్వారానో లేక ఏదో దుర్భలమైన దుర్ఘటన ద్వారానో లేక నిరాశచే నలుగగొట్టబడి ఎక్కడను ఓదార్పు పొందలేక ఈ మొదటి అడుగు వేయుదురు. కొందరైతే ఏదో పాపమునకు బానిసలై యుందురు. ఆ పాపము వారిని ఏలుచుండును. ఎవరును ఆ పాపము

నుండి వారిని విడిపించలేరు. యిట్టి పరిస్థితులను దేవుడు మన జీవితములలో రానిచ్చును. మన నిస్సహాయతను చూపించి, దేవునికి ఎట్లు మొఱ్ఱపెట్టవలయునో మనకు నేర్పించుటకే యిట్టి పరిస్థితులను రానిచ్చును. రక్షణ కొరకై మనము మొఱ్ఱపెట్టగా ప్రభువు మనకు ఉత్తరమిచ్చును. అప్పుడే ఆయనను వాస్తవమైన వానిగా మన వ్యక్తిగత జీవితములలో ఎరుగుదుము.

దావీదుకు దేవుడు ఎట్లు నిజమైన వ్యక్తిగా కాగలిగెనో చూచెదము. దావీదు దేవునిపట్ల అత్యాసక్తిగలవాడైనను అతడు వ్యక్తిగతముగా దేవుని ఎరుగలేదు. మొదటిగా తన ప్రయత్నములన్నియు చాలించి, తనంతట తానేమియు చేయలేడని గ్రహింపవలసి వచ్చెను. సౌలు ఈర్ష్యతో దావీదును చంప వెదకునప్పుడు అతని భార్య అతనిని సౌలు నుండి రక్షింపలేక పోయెను. అతని బంధువులు కాని, స్నేహితులుగాని, యాజకులుకాని కాపాడలేక పోయిరి. అట్టి స్థితిలో దావీదు ఒక గుహలో చేరి దేవునికి మొఱ్ఱపెట్టెను. ఆ సమయములోనే దేవుడతనికి వాస్తవమైన వాడయ్యెను. అది మొదలుకొని దావీదు ఎన్నో కీర్తనలు రచించెను. లోకములోని అన్ని తరగతుల ప్రజలకు, పలురకముల పరిస్థితులలో వెళ్ళుచున్నవారికి ఈ కీర్తనలు ప్రోత్సాహకరముగా నున్నవి.

"అబద్ధమాడు పెదవుల నుండి నన్ను విడిపించుము" (కీర్తన 120:2). అబద్ధమాడు పెదవుల వలనను, మోసకరమైన నాలుకద్వారాను మిగుల శ్రమపడుదుము. మనము బాధపడుటయే గాక యితరులను కూడా బాధపరచెదము. ఒక అబద్ధము ద్వారా మన సమాధానమును పోగొట్టుకొనెదము. మనము సమాధానమును కోల్పోయి బాధపడెదము. దాని వలన కలుగు నష్టము ద్వారా యితరులు కూడా శ్రమపడుదురు.

మనలను గూర్చి యితరులు అబద్ధములు పలికినప్పుడు కూడ మనము నష్టపడి శ్రమనొందుదుము. కనుక ఎట్టి అబద్ధములైనను మనలను దౌర్భాగ్యులనుగా చేయును. సజీవుడును, ప్రేమామూర్తియైన దేవుడే అబద్ధము లాడు పెదవులనుండియు, మోసకరమైన నాలుక నుండియు మనలను విడిపించగలడు.

"మోసకరమైన నాలుకా, ఆయన నీకేమి చేయును?" (కీర్తన 120:3). మన నాలుకను స్వాధీనపరుచుకొని, దానిని జయించుట మనకెంతో కష్టము. ఒక్క చిన్నమాటకే మనకు కోపము వచ్చును, యిక మన నాలుక స్వాధీనములో యుండదు. ఏ మానవశక్తియు దానిని సాధుపరచలేదు. అనేక సార్లు యితరుల మనస్సు నొప్పించు మాటలు పలికెదము. ఒక్కొక్కప్పుడు మనలను ప్రేమించు ప్రియ స్నేహితులను కూడ మాటలచే నొప్పించెదము. వారిని నొప్పించుట మనకు యిష్టము లేదను మాట నిజమే. కాని ఎన్నోసార్లు తప్పిపోవుచున్నాము. దేవుని శక్తి మాత్రమే మన నాలుకలను స్వాధీనపరచగలదు.

యాకోబు 3వ అధ్యాయము 1 నుండి 15 వచనములు చదువుడి. ప్రత్యేకముగా 4 నుండి 6 వచనములు గమనించుడి. ఓడలోని చుక్కాని ఎంతో చిన్నదైనను నావికుడు ఆ చుక్కానిని తన స్వాధీనములో యుంచుకొని, దాని ద్వారా ఆఓడను నడిపించును. మన నాలుకను దేవుని ఆధీనములోనికి తీసుకొని రావలెను. అప్పుడే అక్కరలోయున్న ప్రజలకు మనము సహాయపడగలము. మనము పొరపాటు చేసినప్పుడు నిజమైన దీనత్వముతో క్షమాపణ కోరగలము. మన నాలుకను దేవుని వశము చేయకపోయినట్లయినచో అబద్ధములు, ఈర్ష్య, ద్వేషము, కోపముతో కూడిన మాటలే మన నోట నుండి వెలువడును. దానిద్వారా అనేక

జీవితములలో నష్టమును కలిగించెదము. అటు పిమ్మట చేసిన పనికై విచారించి, క్షమాపణ కోరుకొనుట కష్టమగును. కలహించిన యిరుపక్షముల వారిని సమాధానపరచుటకు ఒక్కొక్కప్పుడు అనేక రాత్రులు పట్టును. వారు చేసిన పని వారు గ్రహించినప్పటికిని, ఎదుటివారిని క్షమాపణ అడుగుటకు ఒప్పుకొనరు. వారి విషయములో తప్పిపోయిరని ఒప్పుకొందురుగాని క్షమాపణ కోరుకొనుట వారికి చేతకాదు. క్షమాపణ అడుగుట అసాధ్యమైన విషయము. కనుకనే దావీదు శ్రమలో యెహోవాకు మొఱ్ఱపెట్టెను. యితరులతో పాటు తాను కూడ నాలుకతో పలికిన ద్వేషపూరితమైన మాటలు, కోపోద్రేకముతో మాట్లాడిన మాటలు జ్ఞాపకము తెచ్చుకొనెను. నాలుకను స్వాధీనపరచుకొన గోరెను. గాని అది అతని వలన కాక పోయెను. కనుకనే దేవునికి మొఱ్ఱపెట్టెను. మన జీవితములలో కూడ యిట్టి అనుభవమును పలుమార్లు కలిగియున్నాము. ఎంతో దౌర్భాగ్య స్థితిలో యుండి దేవునికి మొఱ్ఱపెట్టగా ఆయన మనలను విడిపించెను. మన గొప్ప రక్షణలోని మొదటి మెట్టు యిదే.

## 2. దేవుని సహాయము

"యెహోవా వలననే నాకు సహాయము కలుగును" (కీర్తన 121:2) అని కీర్తన రచయిత వ్రాయుచున్నాడు. 120వ కీర్తనలో దావీదుకు మానవ సహాయము దూరమగుట చూచెదము. సహాయమునకు ప్రతిగా కలహమును, శ్రమను ఎదుర్కొనెను. "అయ్యో ..... కలహప్రియుని యొద్ద నేను చిరకాలము నివసించినవాడను, నేను కోరునది సమాధానమే. అయినను మాట నా నోట వచ్చినతోడనే వారు యుద్ధమునకు సిద్ధమగుదురు." (కీర్తన 120:5-7). అట్టి విషాద పరిస్థితులలో అతడు

దేవునికి మొఱ్ఱపెట్టగా దేవుడతనిని ఆదరించెను. (121:1). "కొండలతట్టు నా కన్నులెత్తుచున్నాను", దావీదు మనుష్యులవైపు చూచుట చాలించి బలవంతుడైన, ప్రేమగల దేవునివైపు తన దృష్టిని కేంద్రీకరించెను. భూలోకమందును, పరలోకమందును సర్వాధికారముగల దేవునిపై తన దృష్టి నిలిపెను. అప్పుడే "ఇశ్రాయేలును కాపాడువాడు కునుకడు, నిద్రపోడు" అను విషయమును అనుభవపూర్వకముగా ఎరిగెను. మన జీవితములో ఎదుర్కొను ప్రతిపరిస్థితిలో దేవునికి ఎట్లు మొఱ్ఱపెట్టవలయునో మనము నేర్చుకొనవలెను. ఈ జీవితయాత్ర అనేక ఆపదలు, విపత్తులు, శోధనలతో కూడినది. లోకములో మనకు శ్రమ కలుగును. కనుకనే మనము వేయు ప్రతి అడుగు కొరకై దేవుని యెదుట కనిపెట్టి ప్రార్థన ద్వారా ఆయన సహాయమును పొందుటకు నేర్చుకొనవలెను. ఆయన సహాయము ద్వారా తొట్రిల్లకుండ కాపాడబడుదుము.

ఆపరేషను జరిగించక మునుపు ప్రార్థన చేయు తెలివైన డాక్టర్లను కొందరిని నేనెరుగుదును. కొన్ని సంవత్సరముల క్రితము ఉత్తర ఇండియాలో పేరుగాంచిన కంటి డాక్టరును కలిసికొంటిని. అతడు దినమునకు ఎన్నో ఆపరేషనులు జరిగించెడివాడు. అయినను అతడెప్పుడును తన శక్తి సామర్థ్యము మీద కాని, తన అనుభవ జ్ఞానము మీద కాని ఆధారపడెడివాడు కాదు. ప్రతి ఆపరేషనుకు ముందు ఇట్లు ప్రార్థించెడివాడు. "దేవా, నీవే నా చేతులను నడిపించి, నాకు సహాయము చేయుము. నాకు కావలసిన నిపుణతను నీవే ప్రసాదింపుము." పిమ్మట దేవుడే నాకు సహాయము చేయునను నమ్మకముతో ధైర్యముగా ఆపరేషన్ చేసెడివాడు. దేవుడు అతని విశ్వాసమును ఘనపరచెను. తత్ఫలితముగా అతడు గొప్ప శస్త్ర వైద్యుడయ్యెను. అంతేకాక ఆత్మలను కూడ సంపాదించ గలిగెను. ఈ కంటి డాక్టరు రోగుల కొరకై, వారి ఆపరేషనుల కొరకు

ప్రార్థించుచుండెను. ఆయన ప్రార్థనలకు దేవుడు జవాబిచ్చెను. ఆయన సాక్ష్యము, ప్రార్థనా జీవితమును చూచి చికిత్సకు వచ్చినవారు జీవము గల-దేవుని కనుగొని ఆయనను తమ రక్షకునిగా అంగీకరించిరి.

మనము ఎక్కడకు వెళ్ళినను, ఏ చిన్న పనిచేసినను దానికి ముందు ప్రార్థన చేయుటకు నేర్చుకొనవలెను. ఆ పని అల్పమైనదైనను సరే - సులభమైనదైనను సరే - ప్రార్థనతోనే మొదలు పెట్టవలయును. ప్రార్థించే సమయము వ్యర్థమని మా[illegible] ఎన్నటికిని తలంచకూడదు. ప్రార్థించుట ద్వారా గొప్ప మేలును పొందెదము, ఇల్లు ఊడ్చుటకు ముందు, పాత్రలు శుభ్రము చేయుటకు ముందు లేక ఏదైన పనిచేయుటకు ముందు ప్రార్థన ఎంతో అవసరము. వంటలో తామే నిపుణులమని తలంచేవారు ప్రార్థన అవసరతను గుర్తించరు. అట్టివారు ప్రార్థన అనవసరమని తలంచెదరు. అట్టి వైఖరితో వారు వంట చేసినప్పుడు, వేయవలసిన పదార్థములన్నింటిని సరియైన పాళ్ళలో వేసి వండినను ఆ వంట రుచిగా యుండదు. అయితే నీవు ప్రార్థించి వంట ప్రారంభించి నట్లయిన, నీకు వంట విషయము ఏమి తెలియక పోయినప్పటికిని, ప్రభువే ఆ పనిని గూర్చి బాధ్యత పుచ్చుకొనును గనుక ఆ వంట ఎంతో రుచికరముగా యుండును. నేను ఈ విషయమును నా అనుభవములో ఎరిగితిని. నేను తిరిగి జన్మించిన కొన్ని నెలలకే నాకు ఎక్కడను ఉద్యోగము దొరకనందున వంటవానిగా పనిచేయవలసి వచ్చెను. వందమందికి వంట సిద్ధము చేయవలసి వచ్చెను. వంటలో నాకెట్టి అనుభవము లేదు. నేను కేవలము దేవునివైపు చూచుచు, నూనె లేక వెన్న ఎంత వాడవలయునో దేవునినే అడిగితిని. వంటలో వాడవలసిన పదార్థములన్నింటిని ఏ పరిమితిలో వాడవలయునో ప్రభువునే అడిగితిని.

అట్లు మొదటిసారిగా వంట చేసితిని. వండినదేదియు మిగులలేదు. ఏదియు నష్టము కాలేదు. ఆ వంట ఎంతో రుచిగా యుండి అందరి మెప్పు పొందెను. దేవుని మహిమార్థమై నేను దీనిని చెప్పుచున్నాను.

దేవునికి మొఱ్ఱపెట్టుట ద్వారా మనము చేయు ప్రతిపనిలో దేవుని సహాయము పొందెదము. నీకు అప్పగించబడిన పనిని ప్రారంభించక మునుపు చిన్న ప్రార్థన చేయుము. ఆ పని అల్పమైనను, సుళువైనను లేక ముఖ్యమైనను ప్రార్థన చేసి ఆ పనిని దేవుని హస్తగతము చేయుట ద్వారా సమస్తము చక్కగా జరుగును. కనుక ప్రతి అక్కరకొరకై దేవుని సహాయము అడుగుటకు నేర్చుకొనుము. అనుదినము ప్రతి పరిస్థితిలో దేవుని సన్నిధిని ఋజువు పరచుము. నీవు ఎప్పుడైనను, పగటివేళలో గాని, దేవునికి మొఱ్ఱపెట్టవచ్చును. నీవు ఎన్ని పర్యాయములు ఆయన యొద్దకు వెళ్ళినను ఆయన విసుగుకొనడు. " ఈ సమయములో ఏల వచ్చితివి?" అని ఎన్నడూ గద్దించడు. మనుష్యులైతే, "ఈ రోజు కాదు, రేపు రండి లేక ఎల్లుండి రండి" అని పంపించి వేయుదురు. "రేపు" అనుమాట ప్రభువు ఎన్నటికిని చెప్పడు. ఆయనకు మొఱ్ఱపెట్టుట మనము నేర్చుకొనినట్లయిన బాధకరమైన అనేక అనుభవముల నుండియు, పతనముల నుండియు రక్షింపబడగలము.

దేవుడు ఎంతో చిన్న విషయములలో కూడ శ్రద్ధ వహించును. పేతురు చెరలోనుండి విడిపింపబడిన సంఘటనను అపొ. కార్య. 12:3 నుండి 10 లో చదివెదము. పేతురు కొరకై సంఘము ప్రార్థించుచుండెను. అప్పుడు దూత పేతురును లేపి, చెప్పులు తొడుగుకొనుమని చెప్పెను. పేతురు తన తొందరలో చెప్పులు మరచిపోవునని తెలియును. నేను ఎవరినైనను కలిసి కొనినప్పుడు వెంటనే వారి పేరు జ్ఞాపకము రాదు.

అప్పుడు వారి పేరు జ్ఞాపకం చేయుమని ప్రభువును అడిగెదను. అప్పుడు వారి పేరు జ్ఞాపకమునకు వచ్చును. అప్పుడు దేవుని మహిమార్థమై ఒకరితో ఒకరము మంచి సహవాసమును అనుభవించెదము.

# 3. విశ్వాసుల సహవాసము

విజయమునకు నడుపు ఉన్నత మార్గములోని మూడవ మెట్టును గూర్చి కీర్త. 122లో చూచెదము. యాత్ర కీర్తనలో యిది మూడవది. ఈ మార్గములో ప్రవేశించక మునుపు మన జీవితములను మనమే నిర్వహించుకొనెడివారము. దానిలో అతిశయించెడివారము. అయితే ఈ ఉన్నత మార్గమునకు వచ్చుట తోడనే మన వైఖరి, ప్రవర్తన, స్వభావము మారిపోవును. దేవుని బిడ్డలతో సమయము గడుపవలెనని కోరెదము. వారి సహవాసమునే అపేక్షించెదము. దేవుని కుటుంబమునకు చెందిన వారముగా మన సుఖ దుఃఖములను దేవుని బిడ్డలతో పంచుకొన గోరెదము. ఆయన ప్రేమతో బంధింపబడిన వారమై, ఎల్లరము చేరి ఆయనను ఆరాధింపవలెనని ఆశించెదము. అట్టి సహవాసము ద్వారానే ఆత్మీయముగా బలపరచబడెదము. దావీదు యిట్టి అనుభవము కలవాడై, "యెహోవా మందిరమునకు వెళ్ళుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" అని కీర్తన. 122:1లో పలికెను. మనము కూడ ఆత్మీయ జీవితములో మరియొక అడుగు వేసినప్పుడు, విశ్వాసులతో కలిసి దేవుని మందిరములో ప్రార్థన ఆరాధనలలో ఎక్కువ సమయము గడుపవలెనని ఆశించెదము. దేవుని బిడ్డల సహవాసమును నిరాకరించి, లోక వ్యవహారములను ప్రేమించెడివారు ఆత్మీయముగా దరిద్రులై

యుందురు. క్రమముగా బైబిలు పఠనము నిమిత్తమును, ప్రార్థన కొరకును కలిసికొనెడి పరిశుద్ధులు పొందుబలమును, ప్రోత్సాహమును వారు పొందలేరు. దేవుని మందిరములో సేవ చేయువారు పొందు ఆనందము వారికి యుండదు.

ఆది సంఘములోని విశ్వాసుల బలము అభివృద్ధి చెందుట లోని రహస్యము పరిశుద్ధుల సహవాసమే. విశ్వాసులు అపోస్తలుల బోధయందును, సహవాసమందును, రొట్టె విరుచుట యందును, ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి (అపొకా. 2:42). దేవుని వాక్యమును ఘనపరుచుట ద్వారా శత్రువు యొక్క పన్నాగముల నుండి తప్పింపబడెదము. ఈ చివరి దినములలో శత్రువు చురుకుగా పనిచేయుచున్నాడు. 2 తిమోతి 3:1-3; 12, 13లో చివరి దినములలో ప్రబలమగు ముప్పది రకములైన పాపములను గూర్చి చదివెదము. వీటన్నింటిని జయించవలెననిన మనము ప్రభువుతోనూ, ఆయన బిడ్డలతోను సన్నిహిత సహవాసము కలిగి యుండవలెను. మనంతట మనమే ఏ పరిస్థితిని మార్చలేము. నీవు ఒంటరిగా నీ యింటిలో కొన్ని గంటల తరబడి బైబిలు చదువవచ్చును. అయితే విశ్వాసుల సహవాసములో బలపరచబడినట్లుగా ఒంటరిగా బైబిలు చదువుట వలన బలపరచబడవు. పూర్వ దినములలో ఋషులు, సన్యాసులు అడవిలో వంటరిగా ప్రార్థనలో ధ్యానములో చాల సమయము గడిపెడివారు. ఆ రీతిగా ధ్యానించుట వలన శత్రువును సులభముగా జయించగలమని వారు భావించెడి వారు. అయితే వారు ఇంకను బలహీనులయ్యెదరు. దేవుని యింటికి, పరిశుద్ధుల సహవాసమునకు విశ్వాసులు రాలేకపోవుట ద్వారా వారు ఓడింపబడి, బలహీనులుగా యున్నారు. లోక స్నేహితుల ద్వారా వారు అడ్డగింపబడుట వలన పరిశుద్ధుల సహవాసమును పొందలేక బలహీనులుగానే

నిలిచియున్నారు. దేవుని యింటిలో ఎంత ఎక్కువ సమయము దేవుని బిడ్డల సహవాసములో గడిపెదమో, దేవుని యింటిలో ఎంత ఎక్కువగా సేవచేయుదుమో అంత ఎక్కువగా బలపరచబడుదుము.

కీర్తనల రచయిత బలవంతముగా ఎన్నడును దేవుని యింటికి వెళ్ళలేదు. కాని ఇష్టపూర్వకముగా వెళ్ళెడివాడు. కూటములకు వెళ్ళుట అనేకులకు ఇష్టముండదు. ఎవరైనను బలవంతము చేస్తేనేగాని కూటములకు రారు. కొందరు పిల్లలను వారి తల్లులు బలవంతపెట్టుదురు. స్నేహితుల ప్రోద్బలము మీద కొందరు వచ్చెదరు. కొంతమంది తల్లిదండ్రులను వారి పిల్లలే బలవంతముగా తీసికొనివచ్చెదరు. అట్లు బలవంతముగా కూటములకు వచ్చువారు హృదయములో ఎట్టి కోరిక లేకయే వచ్చెదరు. గాన వారు ఎట్టి ఆశీర్వాదమును పొందరు. అట్లు గాక, సంతోషముతో దేవుని యింటికి వచ్చినట్లయిన శ్రేష్టమైన ఆశీర్వాదములను పొందగలరు. దేవుని యింటిలో పూర్తి పాలును అనుభవించవలయును. కొందరైతే, కూటమునకు హాజరైతే చాలునని తృప్తి పడెదరు. కూటములో నుండి లేచిపోవలయునని తలంపు కలిగినప్పుడెల్లను వెళ్ళిపోవచ్చుననే ఉద్దేశముతో చివర వరుసలో ఎక్కడో ఒక మూలను కూర్చుండెదరు. కూటము ముగించక మునుపు కొంచెము సేపు కూటములో కూర్చొని, "నేను కూడ కూటమునకు వెళ్ళితిని" అని తృప్తి చెందెదరు. అయితే నీవు లోపలికి ప్రవేశించి, కూటములోని ప్రతికార్యక్రమములో సంపూర్ణ భాగము పొందునప్పుడే నీవు అధికముగా ఆనందించి, ఆత్మీయముగా ఎదిగి బలము పొందగలవు.

దేవుని యింటికి వచ్చుట ద్వారా దేవుని సింహాసనము నుండి వచ్చు శక్తిని, అధికారమును అనుభవించెదము (5వ వచనము) కలసి

ప్రార్థించుట ద్వారా సాతానుశక్తులను బంధించుటకు దేవుని అధికారమును పొందెదము. ఈ అధికారమును ఒంటరిగా యుండినట్లయిన పొందజాలము. సంఘమునకు మాత్రమే ఈ అధికారము యివ్వబడినది.

దేవుని ఇంటికి వచ్చుట ద్వారా మన సమాధానము అధికమగును, మన మార్గములలో వర్థిల్లెదము (7వ వచనము). దేవుని యింటిలో మన భాగమును సంతోషముగాను, క్రమముగాను, నమ్మకముగాను నెరవేర్చుట ద్వారా మన సమాధానము విస్తరించి మనము అభివృద్ధి చెందెదము.

దేవుని యింటిలో ఆయన ప్రజలతో సహవాసము చేయ వలయుననే భారమును, ఆయన ప్రసన్నతను నిత్యము చూడవలయునను కోరికను ప్రభువు మనకు దయచేయును గాక!

# 4. సద్భక్తి వలన శ్రమ

యేసుక్రీస్తు ప్రభువు యొక్క కృప యందును, జ్ఞానమందును మనము ఎదుగుకొలది ఆయనను మన రక్షకునిగా యితరుల యెదుట ఒప్పుకొని, సాక్ష్యమిచ్చుకొలది మనము యితరుల ద్వారా విసర్జింపబడి, ద్వేషింపబడెదము. తమ ప్రవర్తన అంతటియందు దేవుని అధికారమునకు ఒప్పుకొననివారి ద్వారా తప్పక శ్రమ కలుగును. "క్రీస్తు యేసు నందు సద్భక్తితో బ్రతుక నుద్దేశించు వారందరు హింస పొందుదురు." (2 తిమో. 3:12). మనము శ్రమపడవలయునని మన ప్రభువైన క్రీస్తు మనలను ముందుగానే హెచ్చరించెను. దాసుడు యజమానుని కంటె అధికుడు కాడు. దాసుడు తన యజమానునివలెను ఉండిన చాలును. ఇంటి యజమానునికి బయెల్జెబూలని వారు పేరు పెట్టియుండిన యెడల ఆయన యింటివారికి మరి నిశ్చయముగా ఆ పేరు పెట్టుదురుగదా'

' (మత్త. 10:24,25). లోకము మనలను ద్వేషించక ముందు ప్రభువును ద్వేషించెను. మనము లోక సంబంధులమైనట్లయిన లోకము మనలను ప్రేమించును. లోకము తన వారిని స్నేహించును. అయితే మనలను ప్రభువు లోకములో నుండి ఏర్పరచుకొనెను. అందువలననే లోకము మనలను ద్వేషించునని ప్రభువు మనకు బోధించెను (యోహా. 15:19,20).

ప్రభువు కొరకై మనము ఏ రీతిగా అందరి ద్వారా ద్వేషింపబడి, విసర్జింపబడి శ్రమ పరచబడెదమో కీర్త.123:3,4లో చదివెదము. మన స్నేహితులు, మనము ప్రేమించి, గౌరవించు వారుకూడ మనలను ద్వేషించెదరు. దాసుల కన్నులు తమ యజమానుని చేతితట్టును, దాసి కన్నులు తన యజమానురాలి చేతితట్టును చూచునట్లు మన కన్నులు కూడ ప్రభువువైపు చూచుటకు నేర్చుకొనినప్పుడే అన్ని పరిస్థితులలో మనము జయమును పొందగలము. ఆయన నామము నిమిత్తము సిగ్గు, అవమానము భరించి, శ్రమపడుట ఒక ఆధిక్యతగా ఎంచవలెను. "ఆ నామము కొరకు అవమానము పొందుటకు పాత్రులని యెంచబడినందున వారు సంతోషించుచు మహాసభ యెదుట నుండి వెళ్ళిరి" (అపొ.కా. 5:41). ఆయన నామము నిమిత్తము శ్రమపొందుట ద్వారా మన సంతోషము అధికమగును.

# 5. ప్రభువు సేవలో శ్రమ

కీర్తనలు 124:1-3లో ఈ రచయిత అన్ని రకముల శత్రువుల ద్వారా ఎట్లు ఎదిరింపబడెనో చదివెదము. మనకును యిట్లే జరుగును. శత్రువు ఎదిరింపుల నుండి కొంతకాలము వరకు భగ్నపరచబడుదుము. అయితే కొద్దికాలము కాగానే బాధకరమైన పరీక్షలను ప్రభువు మన

జీవితములలోనికి రానిచ్చును. పరిస్థితులన్నియు అనానుకూలముగా కనిపించును. గాఢాంధకారపు లోయలోనికి కొంతకాలము ప్రభువు మనలను నడిపించును. అట్టి చీకటిలోయలో నున్నప్పుడు మనము ఒంటరిగాయున్నట్లు బాధపడెదము. ఆ సమయములో అందరును మనలను వదలి వేసినట్లే యుండును.

ద్వితీ. 32:11 చూడుము. పక్షిరాజు పిల్లలు త్వరలోనే ఎగురుటకు ఎట్లు నేర్చుకొనునో గమనించుట మిగుల ఆకర్షణీయముగా యుండును. ఈ పిల్లలు గూళ్ళలో జన్మించును. అవి పుట్టినప్పుడు కళ్ళుమూసికొని యుండును. అవి కొంచెము పెద్దవి కాగానే తల్లిపక్షి ఆ గూటిని బాగుగా కదిలించును. అప్పుడు ఆ పిల్లలు ఎత్తయిన గూటి నుండి క్రిందకు పడును. అవి క్రింద పడకుండునట్లు తల్లిపక్షి తన రెక్కలను చాపి వాటిని కాపాడును. అనేకసార్లు ఈ రీతిగా జరుగును. ఆ పిల్లలు ఎగురుటకు నేర్చుకొను వరకు తల్లిపక్షి అట్లే చేయుచుండును. ఈ రీతిగా ఆ పక్షులు అతి త్వరలో పైకి ఎగురుటకు నేర్చుకొనును. ఈ పద్ధతి బహుబాధకరమైనది. గూడు పడిపోగా ఎత్తునుండి నిస్సహాయముగా పక్షిపిల్లలు క్రిందపడిపోయినట్లే యుండును.

మన జీవితములో కూడ దేవుడు ఈ పద్ధతినే ఉపయోగించును. మన ఏర్పాట్లన్నింటిని ఆయన విరుగగొట్టును. మనకు సహాయము చేయువారు ఒకరైనను కనిపించరు. మనయెడల స్నేహభావమును చూపు వ్యక్తి ఒకరును యుండరు. అటువంటి పరిస్థితిలో ఎంతో నిస్సహాయముగాను, ఒంటరిగానున్నట్లు భావించెదము. అయితే అట్టి దుఃఖకరమైన అనుభవముల ద్వారానే ఆత్మీయముగా ఉన్నతస్థానమునకు చేరుదుము. ఆ సమయములో దేవుని మర్మములు మనకు బయలు పరచబడును.

మిక్కుటమైన శ్రమలు, పరీక్షలద్వారానే మనము సంపూర్ణముగా దేవునిమీద ఆధారపడుటకు నేర్చుకొనెదము. అవిధముగా ప్రభువు శ్రమలలో పాలు పొందినవారమై ఆయన పునరుత్థాన శక్తిని అనుభవించెదము (పిలిప్పీ 3:10). ఆయన శ్రమలలో పాలుపొందుట అనగా అత్యధికముగా శ్రమలు అనుభవించుటయే. యేసుక్రీస్తు ప్రభువు శ్రమలు అత్యధికమైనవి. ఈ లోకములో తన జీవితమును ముగించు సమయములో అందరును ఆయనను వదలివేసిరి. తన ప్రియమైన శిష్యులు సహితము ఆయనను విడిచి దూరముగా పారిపోయిరి. ఎటు చూచినను చీకటి ఆవరించి యుండెను. సూర్యుడు సహా అదృశ్యుడాయెను. ఆయన ద్వారా మేలు పొందినవారు ఆయనను ఎగతాళి చేసి అపహసించిరి. ప్రభువు ఏ రీతిగా శ్రమపడెనో మనము కూడ ఆ రీతిగానే శ్రమపడవలయును. ఆత్మీయముగా ఉన్నత స్థలములకు చేరు నిమిత్తమై ప్రభువు శ్రమలలో పాలి భాగస్థులము కావలయును. ఈ రకమైన శ్రమలను కీర్తనల రచయిత అనుభవించి యుండెను.

కీర్తనలు 124:4,5లో దావీదు యిట్లు చెప్పెను - "జలములు మనలను ముంచివేసి యుండును ప్రవాహము మన ప్రాణముల మీదుగా పొర్లిపారి యుండును." వరదలు ఆకస్మాత్తుగా వచ్చును. ప్రజలు వాటిని ఎదుర్కొనుటకు సిద్ధపడని సమయములో వరదలు వచ్చును. ఎన్నో సంవత్సరముల వరకు వరద ప్రవాహము యుండదు. అయితే, తలంచని రీతిగా అకస్మాత్తుగా ఒక సంవత్సరములో వరద ప్రవాహము కలుగును. ఇటీవల ఉత్తర హిందూస్థానములో వరదలవలన బహు నష్టము వాటిల్లెను. అనేకులు తమ ప్రాణములను కోల్పోయిరి, పశువులు చనిపోయెను. పంటలు పాడయ్యెను. ప్రభుత్వము వారు వరద బాధితులకు సహాయము చేయ పూనుకొనిరి. కాని వారి నష్టమును మాత్రము తీర్చలేకపోయిరి.

మన జీవితములలో కూడ అనుకొనని సమయములలో ఊహించని వారి ద్వారా శత్రువు వరదవలే ప్రవేశించును. మన స్నేహితుల ద్వారా, బంధువుల ద్వారా శత్రువు మనలను ఎదుర్కొనును. మనము ఎవరిని ప్రేమించి, గౌరవించి, కొనియాడుదుమో వారే మనకు విరోధముగా లేచెదరు. అట్టి పరిస్థితులు మనకు సంభవించునని ముందుగానే ఎరిగియుండుట మంచిది. ఆ సమయములో ప్రభువు మనకు విజయము చేకూర్చును. ఆ వాగ్దానమును 2వ వచనములో చూచెదము "యెహోవా మనకు తోడు" అను మాటలు గమనించుడి. సహాయము కొరకై ఎవరి మీదనో ఆధారపడుదుము. మనము వేటిని ఆధారముగా చేసికొనెదమో అవన్నియు నిరాధారమైనవని గ్రహించెదము. అట్టి నిస్సహాయ, నిరాధార స్థితిలో ప్రభువే మనకు సహాయము చేయును. "ఎవడును నా పక్షముగా నిలువలేదు, అందరు నన్ను విడిచి పోయిరి" అని పౌలు కూడ చెప్పెను ( 2 తిమోతి 4:16) తరువాత వచనములో యిట్లు చెప్పెను. " అయితే నా ద్వారా సువార్త పూర్ణముగా ప్రకటింపబడు నిమిత్తమును, అన్యజనులందరును దాని విను నిమిత్తమును ప్రభువు నా ప్రక్క నిలిచినన్ను బలపరచెను గనుక నేను సింహము నోట నుండి తప్పింపబడితిని" ప్రభువు తనతో నున్నందున పౌలు ధైర్యముగా తన శత్రువుల మధ్య సువార్తను ప్రకటింపగల్గెను. పౌలు పక్షముగా నిలబడువారు ఒకరు కూడ లేరని శత్రువుకు తెలియును. అయినను అతడు ధైర్యముగా సువార్త ప్రకటించుచుండగా శత్రువు చూచి సిగ్గుపడెను. ఈ విధముగా శత్రువు ఓడింపబడెను. ఇతరులు మనలను వదిలివేయుటలో ఏ సహాయము లేకుండ నిరాధారులుగా చేయుటలో దేవునికి ఒక ఉద్దేశ్యము కలదు. స్నేహితులు, బంధువులు ఎల్లరును వదిలివేయుదురు. ఆ

స్థితిలో ప్రభువే మనకు సహాయము చేయుట వలన ఆయన నామము మన ద్వారా మహిమ పరచబడును.

ఈ ఉద్దేశము నిమిత్తమే దావీదు కూడ ఎనిమిది సంవత్సరములు సౌలు ద్వారా హింసింపబడెను. ఎనిమిది సంవత్సరముల శ్రమ ముగిసిన పిమ్మట దావీదు యిట్లు చెప్పెను. "బల వంతులగు పగవారు నన్ను ద్వేషించువారు నాకంటె బలిష్ఠులై యుండగా వారి వశము నుండి ఆయన నన్ను రక్షించెను" (కీర్తనలు 18:17). సౌలు దావీదు ప్రాణమును తీయ చూచుచుండెను. మూడుసార్లు అతనిని చంపుటకు ప్రయత్నించెను. అతని స్వజనులు సహితము అతనికెట్టి సంరక్షణను యివ్వలేకపోయిరి. ఒక్క స్నేహితుడైనను సహాయపడలేదు. దేవుని యింటిలో కూడ అతనికి ఆశ్రయము దొరకకపోయెను. పరజనులు తనను చూచి భయపడెడివారు. చివరకు అదుల్లాము అనబడు ఒక గుహలో దాగుకొనెను. ఆ గుహలోనే దేవుడతనికి సమీపస్థుడయ్యెను. అక్కడే దేవుడతనికి ప్రశస్తమైన వాడయ్యెను. అన్ని పరిస్థితులలో దేవుని మీదనే సంపూర్ణముగా ఆధారపడుటకు, ప్రార్థించుటకు అప్పుడే నేర్చుకొనెను. అనుదిన ఆహారమును, భద్రత, క్షేమము కొరకై దేవునినే అడుగుచుండెను. తనతో సహచరులుగా యుండుటకు వచ్చిన నాలుగు వందల మందియు అప్పులు కలిగి, కష్టములలో, యున్నటువంటివారే (1సమూ. 22;1,2) అతని కష్టములలో, ఆపదలలో సహాయము చేయువారు ఒక్కరును లేరు, అంతేకాక, అన్ని వైపుల సౌలు సైన్యము వారిని ఆవరించి యుండెను. ఆహారము కొరకైనను, మరి ఏ అవసరతకైనను ఆ గుహ నుండి బయటకు వెళ్ళుటయే ప్రమాదకరముగా యుండెను. వారి దగ్గర డబ్బు కూడ లేదు. అయినను ప్రభువు వారికి సహాయము చేసెను.

ఈ రీతిగా కష్టములు, శ్రమలు పరీక్షల ద్వారా మనము ప్రభువుకు సమీపముగా రాగలము. ఆ శ్రమలన్నింటిలో ఆయన విశ్వాస్యతను ఋజువు పరచగలము. ఈ పరీక్షలన్నిటి ద్వారా దావీదు విశాల స్థలమునకు తీసికొని రాబడెను (కీర్తనలు 18:19).

మన ఆత్మీయ జీవిత ఆరంభములో యిటువంటి బాధకరమైన పరీక్షలను దేవుడు రానివ్వడు. అయితే ఆత్మీయముగా ఎదుగుకొలది మనము శ్రమపడుటకు దేవుడు అనుమతించును. (1 కొరింథీ. 10:13) మనలో కొందరు ప్రారంభదశలోనే ఈ కష్టములు అనుభవించవలసి వచ్చెను. మరి కొందరు కొంత కాలము గడచిన పిమ్మట ఈ శ్రమలను ఎదుర్కొనెదరు. జీవితములో ఎప్పుడైనను సరే - శ్రమ పడక తప్పదు. మనము వాటిని ఏ సమయములో భరించగలమో దేవుడు ఎరుగును. ఆయన తన చిత్తానుసారముగా మనలను అగ్ని పరీక్షలలో నడిపించును. "పక్షి తప్పించుకొనినట్లు మన ప్రాణము వేటకాండ్ర ఉరి నుండి తప్పించుకొనియున్నది." అని కీర్తనలు 124:7లో దావీదు చెప్పుచున్నాడు. పక్షులను పట్టుకొనువారు గట్టి వలను వేయుదురు. ఆ వలలో పక్షులు సులభముగా చిక్కుకొనును. అయితే పెద్ద తుఫాను వచ్చినను బలమైన గాలి వీచినను ఆ వల తెగిపోవును. లేక ముళ్ళలో చిక్కుకొనినట్లయిన అది చినిగిపోవును. అప్పుడు రెండు మూడు పక్షులు వలలో నుండి తప్పించుకొనును. ఆ రీతిగా మనము కూడ తప్పించుకొనునట్లు ప్రభువు చేయును. శత్రువు తన వలలో మనలను చిక్కించుకొనుటకు ప్రయత్నించును. అయితే ప్రభువు జోక్యము చేసికొని మనలను విడిపించును. మనము ఏదైన పెద్ద శోధనలో యున్నప్పుడు, శత్రువు మనలను చీల్చి వేయుటకు సిద్ధముగా నున్నప్పుడు, ఏ మాత్రము నిరీక్షణకు ఆస్పదము లేని స్థితిలో యున్నప్పుడు, ప్రభువు మనకు దగ్గరగా వచ్చి సహాయము చేయును.

అగ్ని పరీక్షల ద్వారా వెళ్ళునప్పుడు ఆయనే మన సహాయము. ఆ రీతిగా ప్రభువు మనలను విశాల స్థలములోనికి నడిపించును.

"యెహోవా నామము వలననే మనకు సహాయము కలుగుచున్నది" (8వ వచనము). మన శ్రమలో ఆయన యందు నమ్మిక యుంచిన యెడల ఆయన విశ్వాస్యత ఎంత గొప్పదో చూడగలము. అయితే అవివేకులమై మన స్వంతజ్ఞానము, బలము మీదనే ఆధారపడెదము. కనుకనే ఓడిపోవుదుము. మనము ఎంత బలవంతులమైనను శ్రమ కాలములో తప్పక తప్పిపోయెదము. ఈ విషయమును ముందుగా ఎరిగి యుండుట మంచిది. ఆయన కృపను ఆయన శక్తిని ఆధారము చేసికొనుట ద్వారా మన శ్రమలలో, పరీక్షలలో జయము పొందుదుము.

# ౬. దేవుని వాగ్దానములు

కీర్తన 125:1లో ఈ ఉన్నత మార్గములోని ఆరవ మెట్టును చూచెదము. "యెహోవా యందు నమ్మిక యుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలె నుందురు". ఇశ్రాయేలు ప్రజలు యెహోవా నియమించిన పండుగలను ఆచరించుటకై యెరూషలేముకు వెళ్ళెడివారు. వారు యెరూషలేము చుట్టునున్న పర్వతములను ఎక్కుచు వెళ్ళునప్పుడు దేవుడు మన పితరులైన అబ్రాహాము, ఇస్సాకు, యాకోబులతో చేసిన వాగ్దానములను జ్ఞాపకము చేసికొనెడివారు. వారి శ్రమలో నుండి దేవుడు వారిని విడిపించి, వారికి సహాయము చేయునని నమ్మెడి వారు. వారు అవిధేయులై తిరుగుబాటుచేయు ప్రజలైనప్పటికిని, ఎన్నో తప్పిదములు చేయువారైనప్పటికిని, కృపగల దేవుడు వారి ప్రార్థనలను ఆలకించి,

వారిని శ్రమలో నుండి తప్పించెడి వాడు. కదలక స్థిరంగా ఉన్న యెరూషలేము పర్వతములను వారు చూచినప్పుడు మలాకి 3:6లో "నేను మార్పులేనివాడను" అని దేవుడు చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేసికొనుచుండిరి. ఇశ్రాయేలు ప్రజలైతే మార్పు చెందెడి స్వభావము గలవారై దేవునికి తిరుగుబాటు చేయుచుండిరి. ఆయన హృదయమును గాయపరచి, ఆయనకు దుఃఖము కలిగించెడివారుగా నుండిరి. అయితే ఆయన మార్పులేనివాడుగా నుండెను. ఆయన నమ్మదగిన దేవుడు (ద్వి.కాం. 7:9). మనలను మనము తగ్గించుకొని, మన పాపములను ఒప్పుకొనిన తోడనే ఆయన మనలను క్షమించుటకు సిద్ధముగా నుండును. ప్రజలు యెరూషలేముకు ప్రయాణమై వెళ్ళునప్పుడు వారి అవిధేయత, తిరుగుబాటును ఎరిగియుండిరి. అయితే వారు యెరూషలేము పర్వతములను చూచినప్పుడు వారికి మరల నమ్మకము కలిగెను. దేవుని నిబంధనను, ఆయన వాగ్ధానములను జ్ఞాపకము చేసికొని, దేవుడు వారిని క్షమించునని నమ్మకముంచిరి. ఆ రీతిగా దేవుడు వారికిచ్చిన అనేక వాగ్దానములను జ్ఞాపకము చేసి కొనుచుండిరి. యెరూషలేమును ఆవరించియున్న పర్వతములను చూడగనే వారిలో నూతన విశ్వాసమును, నిరీక్షణ ఉదయించుచుండెను. కేవలము వారి అవిధేయత, పాపస్థితి ద్వారానే వారు తమ విశ్వాసమును, శక్తిని కోల్పోయిరని వారు గ్రహించిరి. అయితే యెరూషలేము పర్వతములను చూచి దేవుడు ప్రేమా స్వరూపియనియు, కనికరము గలవాడనియు, ఆయన యందు విశ్వాసముంచిరి. వారు హృదయ పూర్వకముగా ఆయన వైపు మళ్లుకొని, ఆయన యందు విశ్వాసముంచుట ద్వారా, తాను వారితో చేసిన వాగ్ధానములను నెరవేర్చును. జనాంగముగా వారు దేవుని వైపు తిరిగినప్పుడెల్లను ఆయన వారిని దీవించును. తమ అవిధేయతను బట్టి, పాపమును బట్టి వారు చెదరగొట్టబడి, శిక్షింపబడి, హింసింపబడి నప్పటికిని

వారిని శ్రమలో నుండి తప్పించెడి వాడు. కదలక స్థిరంగా ఉన్న యెరూషలేము పర్వతములను వారు చూచినప్పుడు మలాకి 3:6లో "నేను మార్పులేనివాడను" అని దేవుడు చేసిన వాగ్దానమును జ్ఞాపకము చేసికొనుచుండిరి. ఇశ్రాయేలు ప్రజలైతే మార్పు చెందెడి స్వభావము గలవారై దేవునికి తిరుగుబాటు చేయుచుండిరి. ఆయన హృదయమును గాయపరచి, ఆయనకు దుఃఖము కలిగించెడివారుగా నుండిరి. అయితే ఆయన మార్పులేనివాడుగా నుండెను. ఆయన నమ్మదగిన దేవుడు (ద్వి.కాం. 7:9). మనలను మనము తగ్గించుకొని, మన పాపములను ఒప్పుకొనిన తోడనే ఆయన మనలను క్షమించుటకు సిద్ధముగా నుండును. ప్రజలు యెరూషలేముకు ప్రయాణమై వెళ్ళునప్పుడు వారి అవిధేయత, తిరుగుబాటును ఎరిగియుండిరి. అయితే వారు యెరూషలేము పర్వతములను చూచినప్పుడు వారికి మరల నమ్మకము కలిగెను. దేవుని నిబంధనను, ఆయన వాగ్దానములను జ్ఞాపకము చేసికొని, దేవుడు వారిని క్షమించునని నమ్మకముంచిరి. ఆ రీతిగా దేవుడు వారికిచ్చిన అనేక వాగ్దానములను జ్ఞాపకము చేసి కొనుచుండిరి. యెరూషలేమును ఆవరించియున్న పర్వతములను చూడగనే వారిలో నూతన విశ్వాసమును, నిరీక్షణ ఉదయించుచుండెను. కేవలము వారి అవిధేయత, పాపస్థితి ద్వారానే వారు తమ విశ్వాసమును, శక్తిని కోల్పోయిరని వారు గ్రహించిరి. అయితే యెరూషలేము పర్వతములను చూచి దేవుడు ప్రేమా స్వరూపియనియు, కనికరము గలవాడనియు, ఆయన యందు విశ్వాసముంచిరి. వారు హృదయ పూర్వకముగా ఆయన వైపు మళ్ళకొని, ఆయన యందు విశ్వాసముంచుట ద్వారా, తాను వారితో చేసిన వాగ్దానములను నెరవేర్చును. జనాంగముగా వారు దేవుని వైపు తిరిగినప్పుడెల్లను ఆయన వారిని దీవించును. తమ అవిధేయతను బట్టి, పాపమును బట్టి వారు చెదరగొట్టబడి, శిక్షింపబడి, హింసింపబడి నప్పటికిని

తమ్మును తాము తగ్గించుకొని, తమ పాపమును ఒప్పుకొనిన వెంటనే దేవుడు వారికి సహాయము చేసి, వారిని ఆశీర్వదించెను.

నీవు కూడ నిజమైన విశ్వాసముతో దేవునికి మొఱ్ఱపెట్టిన యెడల ప్రేమ, కనికరము గల దేవుడు నిన్ను ఖాళీగా పంపివేయడు. "మన పాపములను మనము ఒప్పుకొనిన యెడల, ఆయన నమ్మదగిన వాడును నీతిమంతుడును గనుక ఆయన మన పాపములను క్షమించి సమస్త దుర్నీతి నుండి మనలను పవిత్రులనుగా చేయును" (1 యోహాను 1:9). నీవు ఆయనను బహుగా దుఃఖపెట్టి యుండవచ్చును. అయితే నీవు నిజమైన పశ్చాత్తాపముతో, నీ పాపములు ఒప్పుకొని, ప్రభువైన యేసుక్రీస్తు నీ పాపములకు రావలసిన శిక్షను, తీర్పును తానే సిలువలో భరించి నీ ప్రతి పాపము నుండి నిన్ను కడిగి శుద్ధీకరించుటకై తన రక్తము చిందించెనని నీవు నమ్మిన యెడల తక్షణమే నీవు క్షమింప బడుదువు. నీ రక్షకుడుగా నిన్ను ప్రతివిధమైన అపవిత్రత నుండి కాపాడగలడని హృదయపూర్వకంగా విశ్వసించుము.

ఇశ్రాయేలు ప్రజలు యెరూషలేమునకు ప్రయాణము చేయు నప్పుడు నూతన విశ్వాసము, నిరీక్షణ కలిగి యుండిరి. వారి యాత్ర ఆరంభములోనైతే దేవుని యింటికి వెళ్ళుటకే భయపడిరి. వారు దేవుని నుండి ఏ రీతిగా తొలగిపోయిరో, ఎట్లు ఆయనకు అవిధేయులై తప్పిపోయిరో వారు జ్ఞాపకము చేసికొనిరి. అట్టి అవిధేయతా స్థితిలో పరిశుద్ధుడైన దేవుని సన్నిధిని సమీపించుటకు వారికి ధైర్యము లేకపోయెను. అయితే, యిప్పుడు ఆ పర్వతములను చూచి దేవుడు నమ్మదగిన వాడనియు, నిబంధనను నెరవేర్చువాడనియు జ్ఞాపకము చేసికొని తమ్మును తాము తగ్గించుకొనిరి.

మనము కూడ మనలను మనము తగ్గించుకొని, మన పాపములను ఒప్పుకొని, ఆయన మాటలకు విధేయులమై, ఆయన కృప, కనికరముల యందు విశ్వాసముంచిన యెడల ఆయన మనలను క్షమించును. అంతేగాక, ఆయన మన నష్టము నంతటిని తిరిగి సమకూర్చును. యెరూషలేము కొండలపైకి ఎక్కుచు వెళ్ళునప్పుడు ఇశ్రాయేలు ప్రజలు ఏ రీతిగా అంతకంతకు నూతన ఆనందమును అనుభవించిరో అదే రీతిగా మనము కూడ ప్రతిశోధనను, పరీక్షను జయించుట ద్వారా అత్యధికమైన సంతోషమును పొందెదము.

యేసుక్రీస్తు ప్రభువును మన స్వంత రక్షకునిగా అంగీకరించి నప్పుడు మన పాత పురుషుని ఆయన సిలువలో అంతము చేసెననియు, ఆయనే మన నీతి అనియు హృదయ పూర్వకముగా విశ్వసించవలెను. అప్పుడు భక్తి హీనులైన ప్రజలు మనకు ఏ హాని చేయకుండునట్లు దేవుడు మనలను ముట్టుకొనుటకైనను వారికి అనుమతి యివ్వడు. ఆయనే మనలను శిక్షించును గాని దుష్టులు మనకు కీడు చేయునట్లు వారికి అనుమతి ఇవ్వడు. బిలాము విషయములో దీనిని స్పష్టముగా చూచెదము. సంఖ్యా కాం॥ 23:1-9లో ఈ విషయము స్పష్టముగా చెప్పబడెను. ఇశ్రాయేలీయులను బిలాము శపించిన యెడల అతనికి గొప్ప బహుమానమివ్వబడునని బాలాకు రాజు వాగ్దానము చేసెను. ఇశ్రాయేలీయులు తిరుగుబాటు చేసిన ప్రజలైనప్పటికిని బిలాము వారిని శపించుటకు దేవుడు ఏ మాత్రము ఒప్పుకొనలేదు. ఎందుకనగా ఇశ్రాయేలు ప్రజలందరు రక్త ప్రభావము క్రింద నుండిరి. ఇశ్రాయేలీయులు ఐగుప్తు నుండి బయలు వెళ్ళక మునుపు దేవుడు వారికి ఆజ్ఞాపించిన రీతిగా ఒక గొఱ్ఱె పిల్లను వధించి, ఆ రక్తమును ద్వార బంధపు నిలువు కమ్ముల

మీదను, పైకమ్మి మీదను చల్లిరి. రక్తమును చిందించుట ద్వారాను, విశ్వాసము ద్వారాను వారు నీతిమంతులుగా తీర్చబడిరి. కనుకనే వారు అవిధేయులై నప్పటికిని, బిలాము వారిని శపించుటకు దేవుడు ఏ మాత్రము ఒప్పుకొనలేదు.

మనము అవివేకులమై, అవిధేయులమైనప్పుడు దేవుడే మనలను శిక్షించును గాని భక్తి హీనులు మనకు కీడు చేయునట్లుగా వారి చేతులకు మనలను అప్పగించడు. దుష్టులు ఎన్నో విధములుగా మనకు హాని చేయ ప్రయత్నించెదరు. కాని దేవుడు ఆ పన్నాగము లన్నింటి నుండి మనలను కాపాడి భద్రపరచును. దేవుడు మనలను కాపాడునని నిశ్చయముగా ఎరుగుదుము (యెషయా 54:17). ప్రేమగల తండ్రిగా ఆయనే మనలను శిక్షించును (హెబ్రీ. 12:9,10). అయితే దుష్టులు మనకు కీడు చేయవలెనని ప్రయత్నించెదరు. ఆ ఉద్దేశముతోనే వారు మనలను ద్వేషించి, మనపట్ల శత్రు స్వభావము చూపుదురు. ఆ సమయములో దేవునిని మన నీతిగా చేపట్టవలయును. యేసు ప్రభువు యొక్క రక్తము ద్వారా మనము శుద్ధీకరింపబడినందులకై ఆయనకు కృతజ్ఞత చెల్లించుచు, యిట్లు చెప్పవలయును. "ప్రభువా, మేము నీ ప్రజలము. మేము తప్పిపోయినప్పటికిని, అవిధేయులమైనప్పటికిని మేము నీ వారమే. మా పాపములను మేము ఒప్పుకొనుచున్నాము. నీవే మమ్మును శిక్షించుము గాని దుష్టులు మమ్మును ముట్టుటకు అనుమతించకుము." మనలను మనము దేవుని చేతులకు అప్పగించు కొనుటలోనే మన భద్రత కలదు. దావీదు కూడ అట్లే చేసెను. "యెహోవా బహు వాత్సల్యత గలవాడు గనుక మనుష్యుని చేతిలో పడకుండ యెహోవా చేతిలోనే పడుదుము గాక" (2 సమూయేలు 24;14) అని

దావీదు దేవుని చేతులకు తనను తాను అప్పగించుకొనెను. దేవుని నీతి ద్వారా నీతిమంతులముగా తీర్చబడి, దేవుని ద్వారా విమోచింప బడిన ప్రజలముగా నుండుట ఎంత గొప్ప ధన్యత! "యెహోవా యందు నమ్మిక యుంచువారు కదలక నిత్యము నిలుచు సీయోను కొండవలె నుందురు".

# 7. కన్నీటితో కూడిన పంట

కీర్త. 126:5,6లో విజయమునకు నడుపు ఉన్నత మార్గములోని ఏడవ మెట్టును చూచెదము. ఇశ్రాయేలు ప్రజలవలెనే విశ్వాస ఘాతకులమై ప్రభువుకు దూరముగా వెళ్ళిన తరువాత, తిరిగి ప్రభువుకు సమీపముగా రాగలుగుటకు గాను మనము వేయు అడుగును ఈ కీర్తన వివరించు చున్నది. మన అవిధేయత ద్వారా ప్రభువుకు దూరమయ్యెదము. ప్రభువుకు దూరముగా నుండుట వలన జీవితములో ఓడిపోయెదము. అట్టి సమయములో ప్రభువు యెడల మొదట మన కుండిన ప్రేమ కనిపించదు. ప్రార్థన కొరకై భారముండదు. దేవుని వాక్యము పట్ల ఆశ యుండదు. ఇట్టి దౌర్భాగ్యస్థితిలో నుండుట వలన ఇతరులను కూడ తప్పు దారిలో నడిపించుటకు కారకులమగుదుము. ఇశ్రాయేలు ప్రజలు కూడ తమ అవిధేయతను బట్టి బబులోను దేశమునకు చెరగొనిపోబడిరి. డెబ్బది సంవత్సరముల తరువాత వారు పశ్చాత్తాప పడగా దేవుడు వారిని మరల వాగ్దాన దేశమునకు తీసికొని వచ్చెను. వారు తిరిగి వచ్చినప్పుడు వారి సంతోషము చెప్పనలవి కాదు. అయితే ఆ సంతోషము దుఃఖముతో కలసి యుండెను. మనము ప్రభువుకు దూరమై, తిరిగి ఆయన సన్నిధిలోనికి చేర్చబడినప్పుడు మన సంతోషము కూడ కన్నీటితో కూడినదై యుండును.

ప్రక. 2,3 అధ్యాయములలో ప్రభువు విశ్వాసులను మారు మనస్సు పొందుమని హెచ్చరించెను. ఏడు సంఘములలో 5 సంఘముల వారికి మారు మనస్సు అవసరమయ్యెను. ఎఫెసు సంఘము మీద ప్రభువు మోపిన నేరము - వారు తమ మొదటి ప్రేమను పోగొట్టుకొనిరి (ప్రక. 2:4). ఎఫెసు సంఘములోని విశ్వాసులు బాగుగా బోధింపబడిరి. అన్య జనులకు అపోస్తలుడైన పౌలు మాత్రమే కాక అతని సహాయకుడైన తిమోతియు, యేసు ప్రభువు పండ్రెండు మంది శిష్యులలో ఒకరైన యోహాను కూడ వారికి బోధించిరి. అయితే కొంత కాలము గడువగానే వారు తమ ప్రేమను వదలివేసిరి. అందువలననే ప్రభువు వారిని కఠినముగా గద్దించెను. మనమును ఒక్కొక్కప్పుడు ఈ అనుభవములోనే యుందుము. ఏదో శోధన వలన ఆత్మీయముగా చల్లారి దేవుని అలక్ష్యము చేయుదుము. ప్రార్థనల కొరకైన భారము క్రమముగా తగ్గిపోవును. నశించు ఆత్మల కొరకై వేదన యుండదు. ఇట్టి స్థితిలో జీవించుచు దానితో తృప్తి చెందెదరు. ఇది ఎంతో ఘోరమైన విషయము. అయినప్పటికిని, ప్రేమగల దేవుడు తన కృప ద్వారా మనలను తనవైపు ఆకర్షించును. అప్పుడు మనలను మనము తగ్గించుకొని ఆయనవైపు మళ్ళుదుము. మనము పోగొట్టుకొనిన సమాధానమును, సంతోషమును ప్రభువు తిరిగి మనకు చేకూర్చును. అట్టి సంతోషసమయములో మనము కన్నీరు కార్చెదము. ఇవ్వబడిన తరుణములను పోగొట్టుకొని నందులకై దుఃఖించి కన్నీరు కార్చెదము. ఇతరులను తప్పు మార్గములో నడిపించి నందులకై దుఃఖించి కన్నీరు కార్చెదము. ఈ రీతిగా మన సంతోషములో కన్నీరు మిళితమై ఉండును. ఇట్టి అనుభవము తరువాతనే పడిపోయిన విశ్వాసులకు మనము తోడ్పడగలము.

ప్రభువు తన మంచితనము, కృపను బట్టి మన పతనములను ఎట్లు క్షమించెనో గ్రహించిన పిమ్మటనే, తప్పిపోయిన వారికి సహాయ పడగలము. సాక్ష్యము పాడుచేసిరని వారిని నిందించి, ఖండించి, కఠినముగా మాట్లాడుటకు బదులుగా వారి పట్ల నిజమైన జాలి, సానుభూతి చూపి, ప్రేమ పూర్వకముగా కన్నీటితో వారి కొరకై ప్రార్థించగలము. వారిని దర్శించి, వారి కొరకై ప్రేమతో వినయ పూర్వకముగా ప్రార్థించుటకు నేర్చుకొనెదము (గలతీ 6 : 1,2). శత్రువు పలు రకములైన యుక్తులచే జీవితములను పాడుచేయుటకు ప్రయత్నించును. శోధన తీవ్రముగా నున్నప్పుడు, ఎడతెగక శోధన కలుగునప్పుడు పడిపోవుట సహజము. ఆ సమయములో యితర విశ్వాసులు వారిని ఖండించి, విసర్జించెదరు. కొందరైతే అట్టివారిని అసహ్యించుకొని ద్వేషించెదరు. అవిశ్వాసులు వారిని తృణీకరించినట్లే విశ్వాసులు కూడ వారిని తృణీకరించెదరు. అయితే మన స్థితిని జ్ఞాపకముంచుకొనిన యెడల మనము ఆ రీతిగా ప్రవర్తించము. మనము విశ్వాసఘాతుకులమై, మన మొదటి ప్రేమను కోల్పోయినప్పుడు, ప్రభువు మనకొరకు ప్రేమతో ఎట్లు వేచియుండెనో, మనము ఆయనవైపు తిరుగగానే, ప్రేమ పూర్వకముగా ఎట్లు మనలను చేర్చుకొనెనో మనము గుర్తెరిగిన యెడల పడిపోయిన వారికి సహాయము చేయకుండ యుండలేము. వారి కొరకై కన్నీటితో ప్రార్థించి, వారిని తిరిగి ప్రభువు సన్నిధికి సమకూర్చుటలో ఎంతైన ప్రయాస పడెదము. వారి కొరకు ఏమైనను చేయుటకు సిద్ధ పడెదము. అనేకసార్లు పడిపోయిన వారి కొరకై కన్నీరు కార్చి ప్రార్థించుట ద్వారాను, వారితో కలసి ప్రార్థించుట ద్వారాను, వారు తిరిగి ప్రభువు సన్నిధిలో చేర్చబడి, ఆత్మీయముగా పోగొట్టుకొనిన స్థానమును మరల పొందగల్గిరి. మా స్వంత అనుభవములో మేము దీనిని ఎరిగియున్నాము. అట్లు గాక వారిని తీర్పు తీర్చి,

ఖండించిన యెడల వారు మిగుల కఠినులయ్యేదరు. వెనుకబడి, దిగజారిపోయిన మన సహోదరులు, సహోదరీల యెడల మనకున్న బాధ్యతను గ్రహించుదుము గాక ! ఈ విషయములో ప్రభువు మనకు మాదిరిగా యున్నాడు. పేతురు పడిపోవుటకు ముందును, పడిపోయిన తరువాతను ప్రభువు అతనితో ఎట్లు మెలిగెనో చూడగలము. కోడి మూడుసార్లు కూయకమునుపే పేతురు తనను ముమ్మారు బొంకునని ప్రభువుకు బాగుగా తెలియును. అందువలన ప్రేమపూర్వకముగా ప్రభువు ముందే పేతురును హెచ్చరించెను. "సీమోనూ, సీమోనూ, ఇదిగో సాతాను మిమ్మును పట్టి గోధుమలవలె జల్లించుటకు మిమ్మును కోరుకొనెను గాని నీ నమ్మిక తప్పిపోకుండునట్లు నేను నీ కొరకు వేడుకొంటిని; నీ మనసు తిరిగిన తర్వాత నీ సహోదరులను స్థిరపరచుమని చెప్పెను" (లూకా 22:31, 32). పేతురు ప్రభువును ఎరుగనని చెప్పినప్పుడు ప్రభువు పేతురువైపు చూచెను. అప్పుడు పేతురు ప్రభువు తనతో చెప్పిన మాట జ్ఞాపకము చేసికొని సంతాపపడి ఏడ్చెను. (లూకా 22 : 61,62). యేసు ప్రభువు యొక్క ప్రార్థన ద్వారానే పేతురు సమకూర్చబడెను.

పేతురు ప్రభువును బొంకినప్పటికిని, ప్రభువు పేతురు నందు నమ్మకముంచెను. పడిపోయిన విశ్వాసుల కొరకు, బలహీనులైన సహోదరుల కొరకు పేతురు ప్రార్థించి, వారిని తనవైపు మళ్లించునని ప్రభువు నిరీక్షించెను. పేతురుతో తాను చివరగా మాట్లాడినప్పుడు కూడ తిరిగి ఈ విషయమును జ్ఞాపకము చేసెను. "నా గొఱ్ఱెపిల్లలను మేపుము", "నా గొఱ్ఱెలను మేపుము", "నా గొఱ్ఱెలను కాయుము" అని మూడుసార్లు పేతురుతో చెప్పెను. (యోహాను 21:15-17). నూతనముగా జన్మించిన వారందరు ప్రభువునందు పసివారే. ఆత్మీయముగా ఎదుగక, బలహీనులుగా నున్నవారు గొఱ్ఱె పిల్లల వంటి వారు. అట్టివారికి ప్రత్యేకమైన శ్రద్ధ

అవసరము వారిని బలపరచవలయును. కొన్ని సమయములలో అట్టి వారిని మోసికొని వెళ్ళవలయును. మన బలహీనతలలో మనకు సహాయపడి, ఆత్మీయముగా మనలను బలపరచుటకు దేవుడు ఎందరినో వాడుకొనెను. కనుక మన సహ విశ్వాసులు కూడ బలహీనులుగా యుండి, ఓడిపోవుచున్నప్పుడు మన కన్నీటి ప్రార్థన, సహవాసము ద్వారా ఆత్మీయముగా వారిని లేవనెత్తుటకు మనము సహాయపడవలయును. "కన్నీటితో విత్తువారు సంతోష గానముతో పంట కోసెదరు" (కీర్తనలు 126:6)

# 8. సంఘ నిర్మాణము

దేవుని మందిరమును కట్టుటలోని రహస్యమును కీర్తన 127:1,2లో చూచెదము. విజయమునకు నడుపు మార్గములోని ఎనిమిదవ మెట్టు యిదే. "యెహోవా యిల్లు కట్టించని యెడల దాని కట్టువారి ప్రయాసము వ్యర్థమే... మీరు వేకువనే లేచి చాల రాత్రియైన తరువాత పండుకొనుచు .... నుండుట వ్యర్థమే." దేవుని మందిరము పట్ల మనకు రెండంతల బాధ్యత కలదు. మొదటిగా, దేవుని మందిరమును కట్టుటలో ఆయనతో జత పనివారుగా యుండుట ; రెండవదిగా మందిరమునకు కావలసిన సామాగ్రిగా అనగా సజీవ రాళ్ళుగా మనముండి ఆయన ద్వారా కట్టబడుట.

మొదటి బాధ్యత పనితో కూడినది. ఆయనతో జత పనివారముగా యుండి, ఆయన యింటిని కట్టుచున్నప్పుడు బహు జాగరూకులమై యుండవలయును. ఏ రీతిగా నిర్మించుచున్నావో జాగ్రత్తగా చూడవలయును. మానవ ఆసక్తితో జ్ఞానముతో దేవుని యింటిని కట్టలేము.

అట్లు చేయకూడదని హెచ్చరింపబడుచున్నాము. "మీరు వేకువనే లేచి చాల రాత్రియైన తరువాత పండుకొనుట వ్యర్థమే". దేవుని యేర్పాటు ననుసరించియే మందిరమును కట్టవలెను. ఈ పనిలో మనము ఎట్లు పాలుపొందవలయునో నేర్చుకొనవలయును. మనలో ఎన్నో అయోగ్యతలు, లోపములు యుండవచ్చును. మన యోగ్యత, అయోగ్యతలతో లోటుపాట్లతో దేవునికి నిమిత్తము లేదు. కాని అన్ని విషయములలో ఆయన శిరస్సత్వము క్రింద నుండుట ద్వారానే ఆయన పనిలో పాలు పొందగలము. ఒకవేళ మనము ఏ కార్యాలయములోనైనను లేక ఏ కర్మాగారములోనైనను పని చేయుచుండినట్లయిన కొన్ని నిమిషములు బయటకు వెళ్ళుటకు కూడ అధికారి యొద్ద అనుమతి పొందుదుము కదా! ఆ నియమమును ఉద్యోగస్తులందరును పాటించవలసినదే. అట్లే ప్రభువు నుండి కూడ ప్రతి చిన్న విషయము కొరకై అనుమతి పొందుటకు నేర్చుకొనుము.

మానవ ఏర్పాటు ననుసరించి, మనము ఎన్నటికిని దేవుని మందిరమును నిర్మించలేము. యేసు క్రీస్తు ప్రభువే మన పునాది. ఆయనే మన నిర్మాణకుడు. మందిర నిర్మాణము కొరకైన మన ఇంజనీరు, పని అంతటిపై తనిఖీదారుడు కూడా ఆయనే. కనుకనే పని విషయమై ఆయననే అడుగుము. పని ఆరంభములోనేమి, బాగుగా కొనసాగింపబడు నప్పుడేమి, అంతములోనేమి, ఎప్పుడైనను సరే ఆయన సలహాను తీసికొనుము. నీ ఏర్పాటులు పరలోక ఏర్పాటుల ననుసరించి వుండు నట్లు ప్రతి యేర్పాటు చేయక మునుపు ఆయనను అడుగుము. నీవు సరియైన పునాది మీద కట్టునట్లు ఆయనతో సంప్రదింపుము. అప్పుడు ఆయన తన ఉద్దేశములు నీకు తెలియచేయును. నీవు ఏదైన తప్పు చేసిన యెడల దానిని ఆయన నీకు చూపించును. అల్పమైన విషయమైనను సరే లేక ప్రాముఖ్యమైన పనియైనను సరే - ఏదైనను ఆయనను

సంప్రదించి ఆయన సలహానుసరించి చేయుట ద్వారా నీకు గొప్ప సంతోషము కలుగును. అట్లు చేయుట ద్వారా ప్రభువును కూడ సంతోషపరచెదము. ఒకవేళ నీవు వెంటనే జవాబు పొందక పోయిన యెడల కొంత కాలము ఓపికతో కనిపెట్టుము. నీవు వ్యక్తిగతముగా గాని, సంఘముతోగాని యితరులతో కలసి గాని చేసిన ప్రార్థనలకు జవాబుగా దేవుడు నీకు తన ఏర్పాటును బయలుపరచును. నీ జ్ఞానమును ఆధారము చేసికొని ఏమియు చేయకుము. ఆయన శిరస్సత్వము క్రింద నుండి, ఆయన ప్రభుత్వము క్రింద నుండినప్పుడే పరలోకపు ఏర్పాటు ననుసరించి, ఆయన పునాది మీద కట్టగలము. అప్పుడే మనము యితరులకు ఆశీర్వాదకరముగా నుందుము. అట్లు గాక ప్రభువు శిరస్సత్వము క్రింద నుండకుండినచో మన ప్రయాస మంతయు వ్యర్థమగును.

దేవుని మందిర నిర్మాణములో ఎట్లు పాలుపొందలయునో విశ్వాసులలో అనేకులకు తెలియదు. ఆదివారము నాడు ఏదో ఒక ఆరాధన స్థలమునకు వెళ్ళి, అక్కడ ఒక ప్రసంగము వింటే చాలునని అనేకులు తలంచెదరు. దేవుని యొద్ద కనిపెట్టి, దేవుని మందిర నిర్మాణములో మన పాలు ఏదో అనుభవ పూర్వకముగా ఎరిగి యుండవలెను. ఈ పాఠము నేర్చుకొనుటకు చాల సంవత్సరములు పట్టవచ్చును. అయినను మనము ఈ పాఠము తప్పక నేర్చుకొనవలయును.

ప్రభువు తన మందిరమును నిర్మించునప్పుడు మనము ఆయన జత పనివారముగాను, పాలి భాగస్థులముగాను యున్న యెడల ప్రభువు మనకు ఆత్మీయ బిడ్డలననుగ్రహించును. మన సాక్ష్యము, సమర్పణ, ప్రేమలను బట్టి మనకు ఆత్మీయ సంతతి కలుగును (కీర్త. 127:4). దాని ద్వారా మనము బలపరచబడి సంతోషించెదము. మన ఆత్మీయ

బిడ్డలు కూడ ప్రభువులో ఎదుగుచు, ఆయనతో నడచుకొలది మన సంతోషము అధికమగును. పౌలు థెస్సలొనీకలోని విశ్వాసులకు ఉత్తరము వ్రాయునప్పుడు, "నా కిరీటము, నా అతిశయాస్పదము మీరే" అని వ్రాసెను. పౌలు వారి మధ్య నున్నప్పుడు తానెంతగా కష్టపడెనో ఆ కష్టమంతటిని మరచిపోయెను. దేవుని మందిర నిర్మాణములో నీవు పాలు పొంది, సజీవ రాళ్ళుగా ఆత్మలను సంపాదించి, వారిని యేసు ప్రభువు సారూప్యములోనికి పెంచిన యెడల కీర్త. 127:4,5 వచనములలో చెప్పబడిన విషయము నిజమైనదని నీజీవితములో ఎరిగెదవు. ప్రసంగముల ద్వారా మాత్రమే మనుష్యులు రక్షింపబడరు. కొన్నిసార్లు ఎవరి సాక్ష్యము వినుట ద్వారానో రక్షింపబడుదురు. ఒక్కొక్కప్పుడు దయ చూపుట ద్వారా కూడ కొందరు ప్రభువు వైపు ఆకర్షింపబడి రక్షింపబడుదురు.

టోరంటో అను పట్టణములో నేను ఒక కళాశాలలో చదువు చుంటిని. అదే కళాశాలలో గ్రీన్‌వే అనునతడు కూడ చదువుచుండెను. మేమిరువురము ఒకే గదిలో నివసించెడి వారము. ఒక రోజు ఉదయమున నేను "మీరు తిరిగి జన్మించారా" అని అతని నడిగితిని అందుకతడు "అవును రెండు వారములక్రితమే నేను నూతనముగా జన్మించితిని" అని ఉత్తరమిచ్చెను. ఆ జవాబు నేను విని ఎంతో సంతోషించితిని. నేను మరల "అదెట్లు జరిగెను?" అని ప్రశ్నించితిని. అందుకతడు "నేను ఒక రోజు క్షౌరము చేసి కొనుచుండగా మీరు నాకు సబ్బు, క్రీము యిచ్చారు కదా ఆ దినమే నేను రక్షింపబడితిని" అని చెప్పెను. అతడు ఒక దినము క్షౌరము చేసికొనుచుండెను. అతనికి సబ్బు లేనందున తన గడ్డమును కోసికొనెను. నేను దానిని గమనించి అతనికి సబ్బు క్రీము ఇచ్చితిని. నేను చూపిన ఆ కొద్దిపాటి దయను గ్రీన్‌వేగారి రక్షణార్థమై

ప్రభువు వాడుకొనెను. నేను చేసిన కార్యము చాలా అల్పమైనది. నేను అతనికి క్రీమ్ యిచ్చినప్పుడు యేసు ప్రభువును గూర్చి నేను చెప్పిన విషయములన్నియు సత్యమేనని అతడు గ్రహించెను. దుఃఖములో నున్నవారిని మనము ఆదరించినప్పుడును, జబ్బుతో నున్నవారిని దర్శించునప్పుడును దేవుడు తన మందిరమును కట్టుటలో మనలను వాడుకొనును.

మన మొదటి బాధ్యత పనితో కూడినది. అయితే మన రెండవ బాధ్యత - మనము ఊరకుండుటయే. ఎందుకనగా దేవుని మందిర నిర్మాణములో మనమే సజీవ రాళ్ళుగా యుండెదము. ఈ సజీవ రాళ్ళతో ప్రభువే తన నివాస స్థలమును కట్టును. "మీరును సజీవ రాళ్ళవలె నుండి ఆత్మ సంబంధమైన మందిరముగా కట్టబడుచున్నారు." (1 పేతురు 2:5). మనము యేసుక్రీస్తు ప్రభువును మన స్వంత రక్షకునిగా అంగీకరించిన దినమే ఆయన జీవము మనకు అనుగ్రహింపబడును. "నాయందు విశ్వాస ముంచువాడు నిత్య జీవము గలవాడు", అని ప్రభువే చెప్పెను. మనలో నిత్య జీవమున్నది కనుకనే మనము "సజీవమైన రాళ్ళు" అని పిలువబడుచున్నాము. దేవుడు తన ఆత్మీయ మందిరమును నిర్మించుటకై మనలను వస్తు సామాగ్రిగా వాడుకొనుచున్నాడు. కనుకనే మనము 'రాళ్ళు' అని పిలవబడుచున్నాము. ఒకని యందు నిత్య జీవముంటేనే గాని అతడు క్రైస్తవుడని పిలువబడడు. అంతేగాక, అట్టివానికి దేవుని మందిర నిర్మాణములో ఏ భాగము యుండదు. దేవుని మందిరమును మనము కట్టుట మాత్రమేగాక తన నివాస స్థలముగా యుండవలయునని ఆయన కోరుచున్నాడు. మానవులముగా, స్వతంత్రముగా జీవించుటకును, యితరులను ప్రేమించి యితరుల ద్వారా ప్రేమింపబడుటకు ఒక యిల్లు కావలయునని కోరుదుము. అట్లే ప్రభువు కూడ తాను నివసించుటకును,

మనలను ప్రేమించి, మనద్వారా ప్రేమింపబడుటకై ఒక యింటిని కోరుచున్నాడు. దేవుడు ప్రేమా స్వరూపి దేవుని యొక్క ముఖ్య లక్షణము ప్రేమ. ఆ ప్రేమ నిత్యమైనది, మారనిది, త్యాగముతో కూడినది ఎట్టి పక్షపాతము లేక అందరిని సమానముగా ప్రేమించునది. ఆ ప్రేమ మన బుద్ధి కందదు తన యింటిని మనము కట్టవలయుననియు, తనకు నిత్య నివాసస్థలముగా మనలను తానేకట్టవలయుననియు ఆయన కోరు చున్నాడు. ఈ విషయము ఎంతో ఆశ్చర్యమైనది.

ఒక గృహమును నిర్మించుటలో రాళ్ల నుపయోగించ వలసి వచ్చినప్పుడు మొదటిగా అవి దొరకు స్థలము నుండి వాటిని త్రవ్వి తీయవలెను. తరువాత అవి ఒకదానితో నొకటి అమర్చబడుటకు తగిన రీతిగా వాటిని చెక్కవలెను. మన ప్రభువు కూడా మనలను త్రవ్వి తీసి ఆయన యొక్క ముఖ్యమైన నమూనాలో మనము ఇముడునట్లుగా మనలను చెక్కును. ఆయన ప్రేమతో మనలను చెక్కునప్పుడు మనలను మనము ఆయనకు లోబరచుకొనుట ఎట్లో నేర్చుకొనిన యెడల మిగత 'జీవముగల రాళ్ళతో' సంఘీభావముతో నుండగలము. ఎందరో విశ్వాసులకు తమ సహ విశ్వాసులతో కలసిమెలసి యుండుట కష్టముగా కనిపించును. వారు ఒంటరిగా ఒక మూలలో సంతోషముతో సమాధానకరముగా నుండ గలరు. అయితే ఇతరులతో కలసి యుండలేరు చిన్న విషయమునకే కలహించెదరు. మనము యితర విశ్వాసులతో సమాధానముగా జీవించుటకు నేర్చుకొనినప్పుడే, దేవుని యింటి కొరకైన దేవుని ఏర్పాటును గ్రహింప గల్గెదము. అప్పుడే మన ప్రయాసము ఫలించును.

# 9. సంఘ క్రమము

మనము సంఘములో దైవ క్రమమునకు లోబడవలయునని ప్రభువు కోరుచున్నాడు. విజయమునకు నడుపు మార్గములోని తొమ్మిదవ మెట్టు యిదే. కీర్త. 128:3లో దీనిని చూచెదము. "నీలోగిట నీ భార్య ఫలించు ద్రాక్షావల్లివలె నుండును. నీ భోజనపు బల్ల చుట్టు నీ పిల్లలు ఒలీవ మొక్కలవలె నుందురు." ప్రభువైన క్రీస్తు శరీరములోని అవయవములుగా ఆయన క్రమశిక్షణ క్రిందికి ఎట్లు వచ్చెదమో ఈ కీర్తన తెలియజేయుచున్నది. ప్రతి విశ్వాసి కూడ ఫలించవలయునని ప్రభువు కోరుచున్నాడు ద్రాక్షావల్లిని ప్రతి సంవత్సరము కత్తిరించ వలయును. అట్లే మన జీవితములు కూడ ఫలభరితము కావలయుననిన, పరీక్షల ద్వారా, శ్రమల ద్వారా వెళ్ళవలయును. కత్తిరించుట ద్వారానే ద్రాక్షావల్లి క్రమముగా ఎదుగగలదు. కొమ్మలు యిష్టానుసారముగా పెరుగుటకు వీలుపడదు.

ఈ పాఠములన్నియు దేవుని యింటిలోనే నేర్చుకొనవలెను. "సీయోనులో నుండి యెహోవా నిన్ను ఆశీర్వదించును నీ జీవిత కాలమంతయు యెరూషలేమునకు క్షేమము కలుగుట చూచెదవు" (5వచనం). సీయోను పరలోక సంఘమును గూర్చి తెలుపుచున్నది. యెరూషలేము ఈ భూమిపై నున్న సంఘమును గూర్చి తెలుపుచున్నది. ద్రాక్షావల్లికి మంచి ఎరువు అవసరము. బలమైన కంచె కూడ అవసరము. మనము కూడ సహ విశ్వాసులతో కలసి ప్రార్థించి, ఆరాధించుట ద్వారా, కలసి బైబిలు పఠించి, ధ్యానించుట ద్వారా మన అంతరంగ పురుషుడు బలపరచబడును. దేవుని యింటిలోనే మన భారములు తొలగింపబడును. మన ప్రశ్నలకు సమాధానము దొరకును. ఆయన చిత్తమునకు లోబడుటకు

కూడ నేర్చుకొనెదము. మనమందరము కలసియున్న సమయములో ఆయన సన్నిధిని బలమైన రీతిగా అనుభవించెదము. అంతేకాక శత్రువు యొక్క పన్నాగముల నుండి రక్షింపబడెదము. మనకు కనిపించు రీతిగా శత్రువు కొన్ని సార్లు పనిచేయును. ఒక్కొక్కప్పుడైతే మనకు తెలియని విధములో వాడు పనిచేయును. అయితే యితర విశ్వాసుల ప్రేమ, సహకారము, ప్రార్థనా సహవాసము ద్వారా వాని ప్రయత్నములన్నిటి నుండి తప్పింపబడి, మన పరీక్షలన్నిటిలో విజయము పొందెదము. భక్తిపరులైన స్నేహితులే మన సుఖ దుఃఖములలో పాలుపొందగలరు. లోక స్నేహితుల యొక్క స్నేహములో దురుద్దేశములుండును. ఒకవేళ వారు నీకేమైన యిచ్చిన యెడల, తిరిగి నీయొద్ద నుండి ఏదైనను పొందవలెనని కోరెదరు. అయితే దేవుని బిడ్డలు సమస్తము దేవుని కొరకే చేయుదురు. ఇట్టి ప్రేమ, సహవాసమే మన జీవితములోనికి ఎక్కువ ఆశీర్వాదమును తీసికొని వచ్చును.

# 10. సంఘ నిర్మాణములో శ్రమ

విజయమునకు నడుపు ఉన్నత మార్గములోని పదియవమెట్టును కీర్త. 129లో చూచెదము. ఈ కీర్తనలోని మొదటి రెండు వచనములలో దేవుని ప్రజలు ఎదుర్కొనవలసిన శ్రమలను చూచెదము. అయితే ప్రభువు శత్రువును ఓడించి, సంఘము ద్వారా తన ప్రేమను మహిమను వెల్లడి చేయవలెనని కోరుచున్నాడు. పాతాళలోక ద్వారములు సంఘము యెదుట నిలువ జాలవని ప్రభువే చెప్పెను (మత్త. 16:18,19). కనుక ఆయన శరీరముగా ఆయన సంఘముగా విశ్వాసులందరు కలసి యుండుట ద్వారానే శత్రువు యొక్క ఎదిరింపుల నుండి కాపాడబడెదరు.

1940వ సం॥ము వరకు సువార్తను అందించుటయే మా ముఖ్యమైన పరిచర్యగా భావించి ఇండియాలోని అనేక ప్రాంతములలో సువార్త దండయాత్రలు జరిగించితిమి. అనేకులు తిరిగి జన్మించి, ప్రభువు కొరకు బలమైన సాక్షులు కావలెననియే మా ఉద్దేశము. ప్రతిచోట అనేకులు తిరిగి జన్మించిరి. కాని కొన్ని నెలలు గడువగానే వారు విశ్వాసములో వెనుకకు జారి, లోకముతో కలిసిపోయిరి. కొద్దిమంది మాత్రమే ప్రభువు కృపలోను, ఆయన జ్ఞానములోను ఎదుగుచుండిరి. విశ్వాసులు తమంతట తామే ఎదుగలేరనియు, సంఘములో సంపూర్ణ సహవాసము పొందునట్లు వారు సంఘములోనికి తేబడుట ద్వారానే ఎదుగగలరనియు ప్రభువు తన కృపలో మాకు బయలు పరచెను (ఎఫె. 4:11-14)లో దేవుని ప్రజలు సంపూర్ణతలోనికి ఎదుగు నిమిత్తమై దేవుడు చేసిన ఏర్పాటును చూచెదము. దేవుడు 5 వరములుగా సంఘమునకు అపొస్తలులను, ప్రవక్తలను, సువార్తికులను, కాపరులను, ఉపదేశకులను అనుగ్రహించెను. వారి 5 రకములైన పరిచర్యలద్వారా ఆత్మలు నూతన జన్మ పొంది, ప్రభువు యొక్క సంపూర్ణతలోనికి తేబడుదురు.

ప్రభువు మాకు బయలుపరచిన రీతిగా, ఆయన వాక్యాను సారముగా సంఘమును కట్టనారంభించితిమి. వెంటనే శత్రువు మమ్మును ఎదుర్కొన నారంభించెను. ఎవరినైతే ఆత్మీయులుగా భావించితిమో వారే మాకు బద్ధ శత్రువులైరి. క్రైస్తవులని పిలువబడు వారే వాక్యమునకు విరోధముగా యుందురని మేము తలంచలేకపోతిమి. వారే సువార్త దండయాత్రలలో పాలు పొందువారిని అడ్డగించిరి. సహవాసమునకు రాకుండ, రొట్టె విరుచుట యందు పాలు పొందకుండ యుండునట్లు వారిని అడ్డగించుటకు అన్ని విధముల ప్రయత్నించిరి. లోకములోని సరదాలను అనుభవించే దినములలో వారిని ఒక్కరు కూడ

విమర్శించలేదు. ఎప్పుడైతే దేవుని బిడ్డలు సంపూర్ణముగా దేవునికి లోబడుదురో అప్పుడే శత్రువు విజృంభించును. దేవునికి బాప్తిస్మములో విధేయత చూపినను, ఆరాధనకు, ప్రార్థనకు కూడికొనినను, దేవుని యింటిలో ఏ పాలు పొందినను, శత్రువు అన్ని వైపుల నుండి మనలనెదురించును. కీర్తన 129:2లో కీర్తనల రచయిత చెప్పినట్లే, వాడు మనమీద అబద్ధములు ప్రచారము చేసి దేవుని పనిని అడ్డగించుటకును, మన చేతులను బలహీనపరచుటకును ప్రయత్నించును. మనము నిజముగా దేవుని యందు నమ్మకముంచి, వారి మాటల యందు, క్రియల యందు లక్ష్యముంచని యెడల దేవుడే మన పక్షముగా పనిచేసి వారి పన్నాగములను విఫలపరచును. ఆస్ట్రేలియా, అమెరికా, ఇండియాలోను, యింకను తదితర దేశములలో కూడ ఇట్లే జరుగుట మేము చూచితిమి. దేవుని సేవకులు అబద్ధములు చెప్పి, దేవుని ఆజ్ఞలను ఉల్లంఘించి, దేవుని పనిని అడ్డగించుదురంటే నమ్మశక్యము కాదు. అయితే మేము వారి మాటలను లక్ష్యపెట్టక, వారి చర్యలను గూర్చి ఏమియు పట్టించుకొనక ప్రభువునే నమ్మితిమి. అనేక సార్లు ప్రజలు నీ మీదకు లేచెదరు. నీకు విరోధముగా వారు మాట్లాడెదరు. నీకు కీడు చేయుటకు పూనుకొనెదరు. అట్టి సమయములో వారి మాటలను నీవు ఏ మాత్రము పట్టించుకొనకుము. ఏ రీతిగానైనను పగ తీర్చుకొనుటకు ప్రయత్నించకుము. చంద్రుని చూచి, ఉమ్మి వేయు వారి ముఖము మీదనే ఆ ఉమ్మి పడునని మనము జ్ఞాపకముంచుకొనుట మంచిది. శత్రువులు మనకు కీడు చేయుటకు ఎంతో ప్రయత్నించెదరు. అయితే మనపట్ల వారు తలంచిన కీడు వారికే తగులును. "సీయోను పగ వారందరు సిగ్గుపడి వెనుకకు త్రిప్ప బడుదురు" అని కీర్తన 129:5లో ప్రభువు మనకు వాగ్దానము నిచ్చెను. మనకు కీడు చేయవలెనని తలంచెడివారే నిందపాలై, శిక్షావిధిలోనికి వచ్చెదరు. వారి ఎదిరింపులను

గూర్చి నీవు చింతించి, కలవరపడి, నిద్రను, ఆకలిని పోగొట్టుకొన నక్కరలేదు. వారిని వారి పన్నాగములకే వదలివేసి నీవు మాత్రము దేవుని దయను అనుభవించుము.

శత్రువు సీయోనును అనగా దేవుని యింటిని ద్వేషించును. నామకార్థ సంఘములను గూర్చి వాడేమియు పట్టించుకొనడు. అయితే నీవు దేవుని ఏర్పాటుననుసరించి, దేవుని యింటిలో యుండవలెనని కోరినప్పుడే ప్రజలు నిన్ను ద్వేషించునట్లు శత్రువు చేయును. దేవుని సత్యమునకు నీవు విధేయుడవు కాకుండునట్లు నిన్ను అడ్డగించును. నీవు దేవుని వాక్యమునకు సంపూర్ణముగా లోబడుటకు యిష్టపడి, ఆయన పరలోకపు ఏర్పాటు ప్రకారము నడువగోరి, ఆయన చిత్తమును నెరవేర్చుటకు ఆశించునప్పుడు నీవు తప్పక ఎగతాళి చేయబడి, అపహసింపబడెదవు. ఇతరులచే తృణీకరించబడి ద్వేషింపబడెదవు. అయినప్పటికిని, ప్రభువు కీర్తన 129:6లో యిచ్చిన వాగ్దానమును నీవు అనుభవించగలవు. "వారు యింటిమీద పెరుగు గడ్డివలె నుందురు గాక ఎదుగక మునుపే అది వాడిపోవును." వర్షము కురిసిన పిమ్మట మిద్దె మీద గడ్డి మొలుచును. కాని అది త్వరలోనే వాడిపోవును. ఎందుకనగా అందులో వేరు లేదు. మిద్దె మీద నుండి వాటిని పెరికి వేయవలయునను చింత అనవసరము. ఏలననగా అది నిశ్చయముగా వాడిపోవును. మిద్దె మీదకు వెళ్ళి దానిని పెరికి వేయుట కేవలము సమయమును, శక్తిని వ్యర్థపరుచుటయే. మన శత్రువులందరు యిట్లే వాడిపోవుదురని ప్రభువు సెలవిచ్చుచున్నాడు. వారిని గూర్చి మనము కలత చెందనవసరము లేదు. వారిని అడ్డగించుటకు కూడ ప్రయత్నించ నవసరము లేదు. మనము మౌనముగా నుండి ఓపిక వహించిన యెడల ప్రభువే తగిన చర్య తీసికొనును.

# II. ప్రభువు కొరకు కనిపెట్టుట

ఈ ఉన్నత మార్గములోని పదునొకొండవ మెట్టును కీర్తన 130లో చూచెదము. పరిపూర్ణుడైన వ్యక్తిని ఒక్కరినైనను ఈ భూలోకములో కనుగొనలేము. మనందరిలో పాప స్వభావము అనగా ఆదాము స్వభావము కలదు. అందునుబట్టి అనేకమార్లు పడిపోయెదము. ప్రభువును ముఖాముఖిగా చూచినప్పుడే మనము ఆయనను పోలియుందుము. అప్పటివరకు అందరము ఏదో ఒక పొరపాటు చేయుచునే యుందుము. అందువలననే కీర్తనల రచయిత 3వ వచనములో యిట్లు చెప్పెను. "నీవు దోషములను కనిపెట్టి చూచిన యెడల ప్రభువా, ఎవడు నిలువగలడు?" వాస్తవముగా మన జీవితములను ఆయన వాక్యము యొక్క వెలుగులో పరీక్షించు కొనిన యెడల ఆయన యెదుట నిలువజాలము. అపోస్తలుడైన పౌలు రోమా 7:18లో యిట్లు పలికెను. "నాయందు అనగా నా శరీరమందు మంచిది ఏదియు నివసింపదని నేనెరుగుదును" అతని హృదయములో ఆత్మ, శరీరమునకు మధ్య నున్న పోరాటమును గూర్చి కూడ అతడు చెప్పెను. అట్టి పోరాటములు మనమును ఎదుర్కొనవలసినదే. అయినను దాని విషయమై అధైర్యపడ నవసరము లేదు. మన ప్రభువు కనికరము గల దేవుడు. ప్రభువు యొద్ద క్షమాపణ దొరకును (కీర్తన 30:4), మనము ప్రభువు యొద్దకు వెళ్ళి, మన పాపములను ఒప్పుకొనిన క్షణములోనే ఆయన మనలను క్షమించును. ఏలయనగా ఆయన మన కొరకే చనిపోయెను. అనగా మన పాపముల కొరకే చనిపోయెను. ఆయన ప్రేమ, కనికరము మన గ్రాహ్యమునకు మించినది. మనము పడిపోయి నప్పుడెల్లను, అనగా తలంపుద్వారా, క్రియ ద్వారా అపవిత్ర పరచబడినప్పుడు, మనలను మనము తగ్గించుకొని, పవిత్రత కొరకై, విడుదల కొరకై విశ్వాసముతో ఆయన ప్రశస్తరక్తమును

కోరుకొనవలయును. అప్పుడు ప్రభువు మనలను క్షమించి, శుద్ధీకరించి, తిరిగి మనము ఆత్మలో నడుచునట్లు చేయును. (గలతీ 5:16).

5,6 వచనములలో - కీర్తనల రచయిత ప్రభువు కొరకు కనిపెట్టుకొని యున్నట్లు చూచెదము. మనము రోగపీడితులమై నప్పుడు, శ్రమ బాధల యందు యున్నప్పుడు, రాత్రంతయు నిద్రపట్టక క్షణములు, గంటలులెక్క పెట్టుకొనుచు ఎప్పుడు తెల్లవారునా అని ఆతురతతో కనిపెట్టుకొని యుందుము. ఇక్కడ అదే తలంపు చెప్పబడియున్నది. ప్రభువు తన యొద్దకు వచ్చి తనను క్షమించి, విడిపించవలెనని గొప్ప వాంఛతో తాను ఆయన కొరకు కనిపెట్టుచున్నానని కీర్తనల రచయిత పలుకుచుండెను. మనము అపవిత్ర పరచబడిన వెంటనే ప్రభువు యొద్దకు వెళ్ళి "ప్రభువా, నేను అపవిత్ర పరచబడితిని. నన్ను కనికరించుము. నీవు కనికరముగల వాడవు. నన్ను క్షమించెదవని నేను నీ కనికరము నందు విశ్వసించుచున్నాను. నీవు నన్ను శుద్ధీకరించెదవని నీ రక్తము నందు విశ్వసించుచున్నాను" అని చెప్పవలయును. అట్లు ప్రభువుతో తిరిగి సహవాసము కలిగి యుందుము. కీర్తనలు 37: 23, 28, 38, 39; సామెతలు 24:16లో ప్రభువు మనకు వాగ్దానముల నిచ్చి యున్నాడు. మన బలహీనతను బట్టి ఒక్కొక్క సమయములో శత్రువు మనలను మోసగించును. అయినను ఆయన రక్తములో మనము కడుగబడి, అయన సహవాసమునకు తిరిగి చేకూర్చబడగలము.

## 12. దీనత్వము

ఈ ఉన్నత మార్గములోని పండ్రెండవ మెట్టు దీనులుగా నుండుటయే. దీనిని 131వ కీర్తనలో చూచెదము. సాధారణముగా ప్రభువు

మనలను దీవించి వాడుకొనినప్పుడు మనము ఉప్పొంగి, అతిశయించెదము. ఇతరుల యెదుట దీనులుగా కనిపించినను, హృదయము నందు అతిశయించెదము. అట్టి అతిశయము సహజముగా కలుగును. కనుకనే దేనియందైనను అతిశయపడకుండునట్లు మనము జాగ్రత్త వహించవలెను. నీ హృదయములోనికి గర్వము ప్రవేశించకుండునట్లు జాగ్రత్త పడుము. నిన్ను గురించి నీవు పొగడుకొనకుము. ఇతరులను పొగ్డడకుము. మనము ఎంతో సులభముగా దేవుని మహిమను దొంగిలించెదము. అయినను దానిని మనము గ్రహింపకున్నాము. ఆయన సేవలో మనమేమి చేసినను అది దేవుని కృపయే, కనుక ఏ విధముగానైనను అతిశయించకూడదు.

పౌలు దీని విషయమై ఎంతో జాగ్రత్త వహించెను. తాను ఏమి చేసినప్పటికిని, ప్రభువు కృప ద్వారానే దానిని చేసెనని యితరులతో స్పష్టముగా చెప్పెను. ప్రతి తరుణములో దేవునినే మహిమ పరచెను. ఆయనను దీనునిగా నిలుపుటకై అతని దేహములోనికి ఒక ముళ్ళును ప్రభువు రానిచ్చెను. పౌలు గొప్ప దైవజనుడు. దేవుని మర్మములను ఎరిగినవాడు. అంతేకాక మూడవ ఆకాశమునకు కొనిపోబడెను. ఆయన ప్రత్యక్షతలనుబట్టి లేక ఆయన అనుభవములను బట్టి తన సేవకుడు గర్వించుటకు శోధింపబడునని దేవుడు ఎరిగి, దీనునిగా నిల్పుటకై ఒక బాధకరమైన ముల్లును శరీరములోనికి రానిచ్చెను (2 కొరింథీ. 12:7). మనము కూడ, "ప్రభువా, నన్ను దీనునిగా నుంచుము. లేకపోయినట్లయిన శత్రువు నాలో ప్రవేశించి, నీ మహిమను దొంగిలించును" అని ప్రార్థించవలయును. గర్వము ద్వారానే చాలా మంది దేవుని సేవకులు తమ అంత్య దినములందు పడిపోయిరి. ఇతరులు మనలను పొగడి,

మెచ్చుకొనునప్పుడెల్లను మనలో గర్వము ప్రవేశించును. మనలను గూర్చి ఉన్నదాని కంటెను ఎక్కువగా మాట్లాడుట ద్వారా, ఒక విషయమును గూర్చి హెచ్చుగా వివరించి వ్రాయుట ద్వారా మనము ప్రజలను మోసగించెదము. మనలను గూర్చి యితరులు అధికముగా తలంచునట్లు చేయుదుము.

తన హృదయము అహంకారము గలది కాదనియు, తన కన్నులు మీదు చూచునవి కావనియు కీర్తనల రచయిత 131:1లో పలికెను. గొప్పవాటి యందు తన మనస్సును నిలుపలేదు. తనకు అందని వాటి కొరకై అభ్యాసము చేసికొనలేదు. మనమైతే అనేక మార్లు మనమెంతో ముఖ్యమైనవారమని చూపెట్టుకొనుటకు ప్రయత్నించెదము. ప్రాముఖ్యమైన స్థానమును ఆశించెదము. ఇట్లే శత్రువు మనలను పడగొట్టును. "ప్రభువా, నన్ను దీనునిగా యుంచుము. శత్రువు యొక్క తంత్రముల నుండి నన్ను కాపాడుము" అని ఎల్లప్పుడు ప్రార్థించుచునే యుండవలెను. అట్లు ప్రార్థించుట ద్వారా మనకు సహాయము లభించును. ప్రభువుకు లోబడి ఆయన ఏర్పాటును అనుసరించుట ద్వారా అన్ని విషయములు మనకు గ్రాహ్యమగును.

# 13. పరలోకపు ఏర్పాటు లోనికి వచ్చుట

కీర్త. 132వ అధ్యాయములో దేవుడు తనను పిలిచిన నిజమైన ఉద్దేశమును దావీదు గ్రహించుటకు ఆరంభించెను. సౌలు కంటె ఉత్తమమైన రాజుగా నుండుటకే తనను దేవుడు పిలిచెనని ఆరంభములో అతడు తలంచెను. సౌలు అవిధేయుడై, మూర్ఖముగా ప్రవర్తించినందున దేవుడు అతని రాజుగా నుండుటకు నిరాకరించెను. అతని స్థానములో దావీదును

కోరుకొనెను. దేవుడు తనను ఏర్పరచుకొనుటలో దేవుని ఉద్దేశమును దావీదు వెంటనే గ్రహించలేదు. తన హృదయానుసారుడైన వ్యక్తిగా నుండుటకే దేవుడతనిని ఏర్పరచుకొనెను. తన మందిరము నిమిత్తమైన పరలోకపు ఏర్పాటును దావీదుకు వెళ్ళడిచేయుటకే దేవుడతనిని కోరుకొనెను. తన ద్వారా నడిపింపబడి, తన ఏలుబడిలో నిలిచి యుండుట ద్వారా మందిర నిర్మాణమునకు కావలసిన సామాగ్రిని చేకూర్చగలిగిన వ్యక్తిగా దావీదును దేవుడు కోరుకొనెను. దేవుడతనిని ఏర్పరచుకొని, అనేక దుఃఖకరమైన అనుభవముల ద్వారా తీసుకొని వెళ్లెను. అతని అనుభవములను ఈ కీర్తనలో చూడగలము. 1 రాజులు; 1,2 సమూయేలు గ్రంథములలో అతని చరిత్రను చదివెదము. ఆయా సమయములలో విశ్వాసులముగా ఊహకు అందని శ్రమలలో వెళ్ళవలసి యుండును. క్రైస్తవ జీవితారంభములో మానవుల యెదుట మంచి జీవితము జీవించుటయే ప్రధానమైనదిగా భావించెదము. దేవుడు మనలను దీవించి, మనకు సహాయము చేసిన చాలునని తలంచెదము. మన వ్యక్తిగత అవసరములను ప్రభువు తీర్చినట్లయిన చాలునని తృప్తి చెందెదము. కూటములలో గాని, దేవుని పనులలోగాని పాలు పుచ్చుకొనవలెనని ఏ మాత్రము తలంచము. ప్రభువైన యేసు క్రీస్తునందున్న కృప ద్వారా ప్రభువు వారిని రక్షించుకొనుటలోని ఉద్దేశము చాలా కొద్దిమంది విశ్వాసులు మాత్రమే గ్రహించెదరు.

దావీదు అనేక కష్టములు, శ్రమలు అనుభవించిన తర్వాతనే తాను ఊహించిన దానికంటెను, శ్రేష్ఠమైన, ఆశ్చర్యమైన వాటి కొరకై దేవుడు తనను సిద్ధపరచుచున్నాడని గ్రహించెను. అతని శ్రమలలో దావీదును దేవుడు జ్ఞాపకము చేసికొనెనని సాక్ష్యమిచ్చెను. సానుభూతిని

కోరి దావీదు దేవునిని ప్రార్థించలేదు. లేక తన శ్రమలను తొలగించమని దేవునిని అడుగలేదు. అయితే తన జీవితములో దేవుని ఉద్దేశంను తెలిసికొనవలెనని కోరెను.

యోబు కూడ దేవుడు తన జీవితములో అంతటి మిక్కుటమైన బాధలను ఏల రానిచ్చెనో గ్రహింపలేకపోయెను. దేవుడు ముఖాముఖిగా కలిసికొని అతనితో మాట్లాడిన తరువాతనే దేవుడు తనకు రెండంతల ఆశీర్వాదము యివ్వనైయున్నాడనియు దాని కొరకై తనను సిద్ధపరచు చున్నాడనియు గ్రహింపగల్గెను. కనుక దావీదు కేవలము సౌలుకు బదులు రాజుగా యుండుటకు మాత్రమే కాకుండ, లోకములో దేవుని ఉద్దేశమును నెరవేర్చుటకు ఆయన తోటి పనివాడుగా, పాలి భాగస్తుడుగా యుండుటకై శ్రమల ద్వారా సిద్ధపరచబడెను.

దావీదు తన జీవితములో అనుభవించిన శ్రమలను గూర్చి తలంచినప్పుడే, దేవుడు తన కొరకై ఒక యింటిని కట్టవలెనని కోరుచున్నట్లుగా దావీదు గ్రహించెను. అప్పుడు దావీదు దేవునితో ఈలాగున ప్రమాణము చేసెను "యెహోవాకు నేనొక స్థలము చూచు వరకు యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాస స్థలము నేను చూచు వరకు నానివాస స్థానమైన గుడారములో నేను ప్రవేశింపను నేను పరుండు మంచము మీదికెక్కను నా కన్నులకు నిద్రరానియ్యను నా కనురెప్పలకు కునుకుపాటు రానియ్యను" (కీర్త. 132 : 4,5.)

ఆదికాలము నుండియు దేవుడు తన సంకల్పములను తన ప్రజలు నెరవేర్చవలెననియే కోరెను. ఆ ఉద్దేశముతోనే తన ప్రజలైన ఇశ్రాయేలీయులను ఐగుప్తు నుండి విడిపించెను..దేవుని ఉద్దేశము తన

ప్రజల ద్వారా నెరవేర్చబడుటకే ఐగుప్తీయుల మీదికి పది తెగుళ్ళను పంపి, తన ప్రజలను ఐగుప్తులో నుండి విడిపించెను.

తన ప్రజలను విడిపించుటలోని దేవుని ఉద్దేశమును బయలు పరచుటకును, ప్రత్యక్ష గుడారము యొక్క మచ్చును తెలియచేయుటకు దేవుడు మోషేను హోరేబు పర్వతము మీదికి రమ్మని పిలిచెను. అక్కడ మోషే నలువది రాత్రింబగళ్లు యుండెను. అప్పుడే దేవుడు ప్రత్యక్ష గుడారము యొక్క మచ్చును మోషేకు బయలు పరచెను. "నేను వారిలో నివసించునట్లు వారు నాకు పరిశుద్ధ స్థలమును నిర్మింపవలెను" (నిర్గమ కా. 25:8) అని యెహోవా దేవుడు చెప్పెను. అయితే ఇశ్రాయేలు ప్రజలు దేవుని అవసరతను, ఆయన ఉద్దేశమును మరచిపోయిరి. కేవలము వారి అక్కరలు తీర్చబడవలయుననే కోరిరి. వారి శ్రమలు, వారి కోరికలను గూర్చియే తలంచిరి. దాని ద్వారా వారి జీవితములో అనేక పతనములను ఎదుర్కొనిరి. వారి జీవితమే ఓడిపోయిన జీవితమయ్యెను. సిగ్గు అవమానములతో నిండిన జీవితమును జీవించిరి. వారి బ్రతుకు కేవలము నిస్సారమయ్యెను. తన ప్రజలను విమోచించి వారిని పిలుచుటలో తన మహిమకరమైన ఉద్దేశమును ప్రజలకు జ్ఞాపకము చేయుటకై ప్రతి యుగములో దేవుడు తన ప్రవక్తలను పంపెను. ఆ ఉద్దేశము వారిలో నెరవేర్చబడుటకై ఎన్నో శ్రమల ద్వారా వారిని తీసికొని వెళ్ళెను. అదే రీతిగా సంఘము పట్ల తాను కలిగియున్న ఉద్దేశమును కూడ దేవుడు తెలియజేయుచున్నాడు. తాను విమోచించిన ప్రజలు తనకు నిత్య నివాస స్థలముగా కట్టబడునట్లు వారిని అగ్ని పరీక్షల ద్వారా తీసికొని వెళ్ళును. సంఘమును గూర్చి అనేకులు మాట్లాడెదరు కాని సంఘము అనగా ఏమో, సంఘములో మన పాలు ఏదో అనేకులకు తెలియదు.

యెరూషలేములోని మందిరమును కట్టుటకైన మందిరపు మచ్చును దేవుడు దావీదుకు తెలియజేసెను. ఆ మందిరము యేసు క్రీస్తు ప్రభువు కట్టుచున్న దేవుని యింటికి అనగా సంఘమునకు ఛాయగా నున్నది (మత్త. 16:8 ; హెబ్రీ 8:5; 9:11).

దేవుడు మోషేను హోరేబు కొండ మీదికి తీసికొని వెళ్లి తన ఉద్దేశమును నెరవేర్చుటలోని మానవ అభిప్రాయములన్నిటి నుండి మోషేను విడిపించెను. దావీదును అనేక శ్రమలు, బాధలు, పోరాటముల ద్వారా తీసికొని వెళ్ళి తన ఉద్దేశమును గూర్చిన మానవ అభిప్రాయములు మానవ జ్ఞానము నుండి రిక్తునిగా చేసెను.

యెహోషువ దినములలో యెరూషలేము నుండి యెబూసీయులను వెళ్ళగొట్టుటలో ఇశ్రాయేలీయులు తప్పిపోయిరి. ఇశ్రాయేలీయులను కనాను దేశములోనికి ప్రవేశపెట్టిన తర్వాత ఆ దేశములో నివసించుచుండిన ఏడు జనాంగములను పారద్రోలవలయునని దేవుడు తన ప్రజలకు ఆజ్ఞాపించెను. వారు హేయమైన అన్య జనుల అలవాట్లను అభ్యసించుచుండిరి. కనుకనే దేవుడు వారిని వెళ్లగొట్ట వలయునని ఆజ్ఞాపించెను. అయితే ఇశ్రాయేలీయుల పట్టణములో బలముగా స్థిరపడిఉన్న యెబూసీయులను ఉండనిచ్చిరి. ఎన్నో సంవత్సరముల తరువాత దావీదు యెరూషలేమును పాలించుచున్నప్పుడు, ఈ యెబూసీయులే దావీదును పరిహసించిరి. దావీదు తన జనులతో వారి మీదికి దండెత్తి వచ్చినప్పుడు, దావీదు లోపలికి రాలేడని తలంచి "నీవు ఇక్కడకు వచ్చిన యెడల ఇచ్చటి కుంటివారును, గ్రుడ్డివారును నిన్ను తోలివేతురు" అని దావీదుకు వర్తమానము పంపిరి. వారిని ఎవరును వెళ్ళగొట్టలేరని నమ్మకముంచిరి.

అయితే యెబూసీయులను వెళ్ళగొట్టుట దేవుని ఏర్పాటు గనుక దేవుడు దావీదుకు, తన జనులకు విజయము కలుగచేసెను (2 సమూ. 5:1-10). అతడు రాజైనప్పుడే, ఇశ్రాయేలీయుల గోత్రములన్నింటిలో కూడ ఎక్కడైనను యెబూసీయులుండరాదని దేవుడతనికి బయలు పరచెను. నీవు దేవుని యింటి నిర్మాణములో పాలు పొందగోరిన యెడల, నీవు కూడ పరలోకపు రాజైన యేసుక్రీస్తు ప్రభువు స్వాధీనములో ఉండవలెను. యేసుక్రీస్తు ప్రభువును మన హృదయములో, మన కుటుంబములో, సంఘములో, రాజుగా ప్రతిష్ఠించినప్పుడే సంఘము కొరకైన దేవుని ఏర్పాటును తెలిసి కొనగలము.

దేవుని యింటిలో యెబూసీయులకు ఏ భాగమును లేదు. అట్లే క్రొత్తగా జన్మించిన వారికి కూడ దేవుని యింటిలో ఏ భాగమును లేదు. ఈనాడు అనేకులు దేవుని పని విషయములో యెబూసీయుల వలెనే ఉన్నారు. డబ్బు, స్థానము, పలుకుబడి తదితర లోక సంబంధమైన యోగ్యతల ద్వారా అనేకులు కమిటీ సభ్యులగుచున్నారు. అట్టివారే నూతన జన్మ అనుభవము లేకపోయినను, సంఘములోని బాధ్యతలు భరించుటకై ఎన్నుకోబడుచున్నారు. కొందరైతే తిరిగి జన్మించక పోయినప్పటికిని వారు పాస్టర్లు, డీకనులు, బిషప్పులుగా పనిచేయు చున్నారు. అట్టివారికి నిజముగా దేవుని యింటిలో ఎట్టి స్థానము లేదు. వారు సంఘమును అనగా దేవుని మందను కాపాడలేరు. వారు పాస్టర్లుగా కాని, కాపరులుగా కాని ఉండతగరు. ఎందుకనగా మందను గూర్చి వారికి శ్రద్ధ ఉండదు. అట్టి వారిని యెబూసీయుల వలెనే వెలుపల వుంచవలెను. కొద్దిమంది యెబూసీయులు ఉన్నను దేవుని పని అడ్డగించబడును. దావీదు యెరూషలేముకు వచ్చినప్పుడు యెబూసీయులలో అనేకులను వెళ్ళగొట్టెను. అయినప్పటికిని అక్కడక్కడ కొంత మందిని వుండనిచ్చెను.

వారు మంచివారుగా నుండినందున దావీదు వారిని వెళ్ళ గొట్టలేదు. అందుకే దేవుడు దావీదును శిక్షించవలసి వచ్చెను. అప్పుడు అతడు వారిని పూర్తిగా తరిమి వేసెను. దేవుని శక్తి ద్వారానే తాను విజయము పొందెనని దావీదు ఎరిగెను. తన శక్తి ద్వారా కాదని కూడ ఎరిగి యుండెను. అయినప్పటికిని తన రాజ్యములో యుద్ధ వీరులెందరు కలరో ఎరుగవలెనని కోరి, తన జనులందరిని లెక్క పెట్టుమని యోవాబుకు ఆజ్ఞ యిచ్చెను (2 సమూ. 24:1 - 4).

ఏ దేశములోనైనను యుద్ధమునకు పూర్వము సైన్యమును లెక్కించెదరు. శత్రువుల సైనికులకు సరిపోయిన సైనికులు వున్నారో లేదో ముందే లెక్క చూచుకొనెదరు. అయితే దావీదు ప్రతిసారి సైన్యము నందు కాక దేవుని యందే నమ్మకముంచెను. గడచిన సంవత్సరము లంతటిలో దేవుడే అతనికి విజయము సంపాదించెనని యోవాబు దావీదుకు జ్ఞాపకము చేసెను. సైన్యము అల్ప సంఖ్యగా వున్నను, అధిక సంఖ్యగా వున్నను దేవుడే విజయము సంపాదించెను. యుద్ధము యెహోవాదే. అయితే దావీదు తన రాజ్యములో నున్న బలాఢ్యులను లెక్కించగోరెను. వెంటనే దేవుడు యెరూషలేములోని ప్రజల మీదికి తెగులు పంపెను. అప్పుడు అనేకులు మరణించిరి.

దావీదు అరౌనా యొక్క కళ్ళములో తన పాపమును గూర్చి పశ్చాత్తాపపడెను. తరువాత అదే స్థలములోనే మందిరము కట్టబడెను. అంతకు పూర్వమే మందిరమును నిర్మించవలసిన స్థలమేదో తెలిసి కొనవలెనని దావీదు కోరెను. "యాకోబు యొక్క బలిష్ఠునికి ఒక నివాస స్థలము నేను చూచు వరకు.... నా కన్నులకు నిద్ర రానియ్యను" అని దావీదు చెప్పెను. (కీర్త. 132 : 4,5) మందిరము కట్టబడు స్థలము

దావీదు కనుగొనవలెనని దేవుడు కోరినట్లు దావీదు తెలిసికొనెను. కనుకనే దేవుడు తనను ఏ శ్రమలోనైనను ఏ బాధలోనైనను తీసికొనివెళ్ళినను యిష్టపడెను. యెబూసీయులు యెరూషలేములో వున్నంతకాలము అతడు ఆ స్థలమును కనుగొనలేదు. దావీదు ప్రజలను లెక్కించినప్పుడు దాను నుండి బెయేర్షెబా వరకు 70 వేల మంది చనిపోయిరి. దేవుడు గాదు ప్రవక్త ద్వారా దావీదుతో తన పాపము నిమిత్తము పాశ్చాత్తాపపడిన స్థలములోనే బలి పీఠమును కట్టి, తన కొరకును, తన ప్రజల కొరకును అర్పణలు చెల్లించవలెనని చెప్పెను. దావీదు క్షమాపణ కోరినవాడై దహన బలులును, సమాధాన బలులను అర్పించెను. అప్పుడే అతనికి మందిర స్థలము విషయమైన ప్రత్యక్షత కలుగగా, అరౌనా యొద్ద నుండి ఆ స్థలమును కొనెను ( 2 సమూ. 24 : 24). ఆస్థలమును కొనిన పిదప యెరూషలేములో ఒక్క యెబూసీయుని కూడ యుండనివ్వక అందరిని తరిమి వేసెను. ఒక్క యెబూసీయుడు యెరూషలేములో నిలిచియున్నను దేవుని ఉద్దేశమునకు భంగము కలుగును. కనుక మనము కూడ సంఘ పెద్దలను, కాపరులను నియమించక పూర్వము వారు తిరిగి జన్మించి యున్నారని నిశ్చయముగా ఎరిగి యుండవలెను. లేనట్లయిన, వారు జీవితాంతము వరకు కష్టమును కలిగించెదరు. దావీదు తనను తాను పూర్తిగ తగ్గించుకొనినప్పుడే, మానవ జ్ఞానము నుండి విడుదల పొందెను. ధాన్యము, పొట్టు వేరు చేయబడు స్థలమే కళ్ళము. రెండుసార్లు దేవుడు దావీదును కళ్ళము యొద్దకు తీసికొని వచ్చెను (1 దిన వృ. 13;2 సమూయేలు 24). అక్కడనే దావీదు జ్ఞానమని భావించిన దానిని పొట్టుగా దేవుడు అతనికి చూపించెను. ప్రజలు తెలివితేటలు, జ్ఞానము, చాతుర్యము అను దాని నంతటిని దేవుడు పొట్టు అని చెప్పుచున్నాడు. పౌలు కూడ తాను మార్చబడిన అనేక సంవత్సరముల

తదనంతరము తనకు లాభముగా యున్న దానిని పెంటతో సమానముగా ఎంచుకొనెను. అరౌనా స్థలములో దావీదు తన జీవితములోని పొట్టు నుండి వేరు చేయబడెను. అటు తరువాతనే అదే స్థలములో దేవుని మందిరము కట్టబడవలయుననిన దేవుని ఏర్పాటు దావీదుకు వెల్లడియాయెను.

అదే స్థలములోనే అబ్రాహాము యొక్క విశ్వాసమును పరీక్షించెను. దేవుడు అబ్రాహాముకు ప్రత్యక్షమై మోరియా పర్వతము మీద ఒక్కడే కుమారుడైన ఇస్సాకును బలిగా అర్పించుమని చెప్పెను (ఆది కాం. 22:1,2). అబ్రాహాము ఎట్టి ప్రశ్న వేయలేదు. కాని ఇస్సాకును తీసికొని మోరియా పర్వతమునకు వెళ్ళి అక్కడ బలిపీఠము మీద అతనిని పరుండబెట్టి, దేవునికి దహనబలిగా ఇస్సాకును అర్పించుటకు సిద్ధపడెను. తన కుమారుని వధించినను, తిరిగి దేవుడతనిని లేపగలడని దృఢముగా విశ్వసించెను. అట్టి విశ్వాసము గలవారమై మనము కూడ దేవుని ఇంటిలో మనపాలును పొందవలయును. ఎట్టి ప్రశ్నలు, సందేహములు మనలో యుండకూడదు. దేవుడు ఏమి చెప్పినను విశ్వసించి, విధేయత చూపుము. దేవుడు ఎప్పుడు పొరపాటు చేయడు. మనమైతే ఒక్కొక్కప్పుడు దేవుని కంటెను మనకు బాగుగా తెలియునని తలంచి, పేతురు వలె దేవునితో వాదించెదము. అపొ. కార్య. 10:9-16లో దేవుడు మూడుసార్లు పేతురుతో మాట్లాడెను. అయితే పేతురు " వద్దు ... ప్రభువా " అని చెప్పెను. ప్రభువు ఎవరిని గాని తప్పు చేయమని యెన్నటికిని చెప్పడు. అయితే పేతురు విధేయుడగుటకు యిష్టపడక, దేవునితో వాదించెను. దేవుని చర్యలను సందేహించుట ద్వారా, ఆయనను ప్రశ్నించుట ద్వారా, ఆయనను ఎంతగా దుఃఖ పరచుచున్నామో మనము గ్రహించము. "మేము ఎంతో మంచి వారము, దేవుని పనిలో పాలు పొందుచున్నాము.

దేవుడు మాకేల యిన్ని శ్రమలు, బాధలు రానిచ్చెను?" అని మనము దేవుని ప్రశ్నించెదము.

అపొ. కార్యములు 9:11, 13, 15లో కూడ దేవుడు అననీయతో మాట్లాడుటను చూచెదము. దేవుడు అననీయతో "నీవు లేచి, తిన్నని దనబడిన వీధికివెళ్ళి, యూదా అనువాని యింట తార్సువాడైన సౌలు అనువాని కొరకు విచారించుము" అని చెప్పెను. అందుకు - అననీయ - " ప్రభువా, యీ మనుష్యుడు యెరూషలేములో నీ పరిశుద్ధులకు ఎంతో కీడు చేసియున్నాడని అతని గూర్చి అనేకుల వలన వింటిని. ఇక్కడను నీ నామమును బట్టి ప్రార్ధన చేయువారినందరిని బంధించుటకు అతడు ప్రధాన యాజకుల వలన అధికారము పొందియున్నాడు" అని ఉత్తర మిచ్చెను. అందుకు ప్రభువు, "నీవు వెళ్లుము,.... ఇతడు నేను ఏర్పరచుకొనిన సాధనమై యున్నాడు" అని పలికెను. కనుక మనము కూడ ఏ మాత్రము వాదించక, ఎట్టి ప్రశ్నలు వేయక ఎటువంటి సందేహము రానివ్వక, ప్రభువుకు లోబడవలెను. మన జ్ఞానము దేవుని దృష్టికి వెర్రితనము. కనుకనే దేవుని ఇంటిని కట్టుటకు దేవుని ఉద్దేశమును ఎరిగి యుండవలెను. బహుశ మనము మంచి భవనములను నిర్మించి యుండవచ్చును. అనేక దండయాత్రలను సాగించి యుండవచ్చును. అయినను దేవుని ఉద్దేశమును, దేవుని ఏర్పాటును ఎరిగి యుండక పోవచ్చును దేవుని యింటి కొరకైన దేవుని ఏర్పాటు దావీదుకు బయలుపరచబడినట్లుగా కీర్తనలు 132:7లో చూచెదము. విరిగిన హృదయముతో, దీనమనస్సుతో ఆయన పాదముల మీద పడి నప్పుడే ఆయన ప్రత్యక్షతను పొందెదము. దేవుడు విరిగి నలిగిన హృదయములనే

కోరుచున్నాడు. తనను సత్యముతో, ఆత్మతో ఆరాధించువారినే వెదకుచున్నాడు. ఆయనను ఆరాధించుటకు నేర్చుకొనిన వారు దిన దినము ఆయన పట్ల నమ్మకముగా యుందురు. దేవుని యింటి నిర్మాణములో యిష్టపూర్వకముగా పాలు పొందెదరు. మనము ఆరాధించుటలో దేవునికి ఇచ్చుటకు నేర్చుకొందుము. అయితే అనేకులు ప్రభువునుండి పొందుటకు మాత్రమే ఆశించెదరు. చాల మంది ప్రభువును పెదవులతో మాత్రమే ఆరాధించెదరు. హృదయములో ఆరాధన యుండదు. దేవునికి విశ్రాంతి, తృప్తి, సంతోషమును కలిగించవలెనని దావీదు ఎనిమిదవ వచనములో చెప్పుచున్నాడు.

చిన్న విషయముల కొరకు కూడా మనము ప్రభువును అడుగుటకు నేర్చుకొనవలెను. చిన్న విషయములలో కూడ దేవుని చిత్తమును ఎరిగి, ఆయన చిత్త ప్రకారము చేయవలెను. ప్రభువైన యేసుక్రీస్తు మన హృదయములలో సింహాసనాసీనుడుగా యుండి, మన జీవితములకు రాజుగా యున్నప్పుడే ప్రభువు చిత్త ప్రకారము జీవించుట సాధ్యమగును. అనుభవము ద్వారా అప్పుడే ఆయన చిత్తమును చేయుటకు నేర్చుకొనెదము. దేవునికి విధేయులగుట ద్వారా ఆయనకు విశ్రాంతి నిచ్చిన వారమగుదుము.

దేవుని చిత్తమును ఎరుగక దావీదు ఫిలిష్తీయులతో చేరినప్పుడు అతడు వెనుకకు పంపబడెను. సిక్లగుకు రాగానే అతడు సమస్తమును కోల్పోయెనని ఎరిగెను. అమాలేకీయులు ఆ పట్టణమును కాల్చివేసి, ఆ పట్టణములోని జనులను వారి భార్య బిడ్డలను సహా చెరగా కొనిపోయిరి. తన తప్పిదముకై దావీదు బహుగా పశ్చాత్తాపపడెను. తరువాతనే దావీదు నష్టము నంతటిని తిరిగి సమకూర్చుకొనెను (1 సమూయేలు 30).

దేవుని మందిరమును కట్టుటలో దేవుని నీతిని నెరవేర్చి పరలోక ఆనందమును అనుభవించెదము. శ్రమలు, బాధలు, కష్టములు, పరీక్షల ద్వారా వెళ్ళవలసి వచ్చినను దేవుని చిత్తమును చేయుటలో సంతోషించెదము. ప్రభువు నందు ఎల్లప్పుడు ఆనందించుటకు నేర్చుకొనినప్పుడే, దేవుని మందిర నిర్మాణములో మన భాగమును పొందగలము.

దేవుని యొద్ద కనిపెట్టుట ద్వారా, ఆయన వాగ్దానములను చేపట్టవలసిన అగత్యతను గుర్తించి ఆయన చేసిన నిబంధనను జ్ఞాపకముంచుకొనగలమని 9 నుండి 12 వచనములలో చెప్పబడినది. యెబూసీయులవందరిని పారద్రోలి, దావీదు సీయోనులో రాజుగా సింహాసనాసీనుడై, ఇశ్రాయేలు గోత్రముల వారి నందరిని పరిపాలించెననే పదమూడవ వచనములో చూచెదము. సీయోనులోనే ఆయన 48వ కీర్తనను రచించెను. ఆయన సీయోనును " మహారాజు పట్టణము" అని రెండవ వచనములోను, " మన దేవుని పట్టణము", " ఆయన పరిశుద్ధ పర్వతము" అని మొదటి వచనములోను, మరియు " మన దేవుని పట్టణము" అని ఎనిమిదవ వచనములోను పిలుచుచున్నాడు. దేవుని యింటిని గూర్చిన ప్రత్యక్షత దావీదుకు కలిగియుండుట వలననే ఆయన సీయోనుకు ఈ పేర్లు పెట్టగలిగెను. "దేవుడు దేనికి శిల్పియు, నిర్మాణకుడునై యున్నాడో, పునాదులు గల ఆ పట్టణమును" గూర్చిన దర్శనము అబ్రాహాము కూడ కలిగి యుండెను ( హెబ్రీ. 11:10). అందువలననే అబ్రాహాము తన స్వజనులను, బంధువులను, ఆస్తి సంపదలను విడిచి, దేవుని వెంబడించుచు గుడారములలో నివసించెను.

యేసుక్రీస్తు ప్రభువునే నీ హృదయమును పాలింపనిమ్ము. ఆయన రాజరికము క్రింద నిలిచి యుండుము, అప్పుడే యెబూసీయులకు నీ జీవితములో ఎట్టి స్థానము దొరకదు. యేసు ప్రభువు యొక్క రాజరికమే యెబూసీయులను పారద్రోలును. యెబూసీయులకు మన హృదయములో ఎక్కడైనను, కొద్ది చోటు యిచ్చిననూ ప్రభువు మిగుల దుఃఖించును.

కీర్తన 132 : 14లో దావీదు ఒక లోక సంబంధమైన భవనమును గూర్చి తలంచలేదు. దేవుని ఏర్పాటు ననుసరించి దేవుని మందిరమును కట్టవలయుననే ఆశించెను. ఈ మందిరము యేసు క్రీస్తు ప్రభువు కట్టుచున్న ఆత్మీయ మందిరమునకు ఛాయా రూపమై యున్నది. అక్కడ దావీదునకు " కొమ్ము మొలవ చేసెదను" అని 17వ వచనంలో ప్రభువు చెప్పెను. దావీదు యేసు ప్రభువునకు గుర్తుగా యున్నాడు. "కొమ్ము" యేసు ప్రభువును గూర్చి తెలుపుచున్నది అనగా దేవుని అభిషిక్తుడు అని ప్రభువును గూర్చియే తెలుపుచున్నది, కనుక తాను నిర్మించనైయున్న మందిరములో యేసుక్రీస్తు ప్రభువును గూర్చిన ప్రత్యక్షత అధికముగా వెల్లడి కాగలదని దావీదు గ్రహించెను. మనము దేవుని యింటికి వచ్చినప్పుడే ప్రభువు కొరకైన మన ఆకలి తృప్తి పరచబడును (16వ వచనం). మన కష్టములు, బాధలు, వేదనలు ఎన్ని యున్నప్పటికిని, దేవుని ప్రజలు సహవాసములోనే గొప్ప సంతోషమును అనుభవించెదము. దేవుని మందిర నిర్మాణములో యిష్టపూర్వకముగా పాలు పొందు వారందరు సమృద్ధియైన సంతోషమును, నిజమైన సహవాసమును అనుభవించెదరు. కేవలము పాటలు విని ఆనందించుట కొరకే దేవుని యింటికి వచ్చి దేవుని మందిర నిర్మాణములో ఎట్టిపాలు పుచ్చుకొనని వారు బహు

త్వరితముగా అభ్యంతర పడెదరు. వారి సంతోషము కూడ త్వరలోనే ఎగిరిపోవును.

# 14. దేవుని సంపూర్ణత

కీర్తన 133లో దేవుని సంపూర్ణతను ఎట్లు అనుభవించగలమో చూచుచున్నాము. మొదటిగా మనము ప్రభువు నందు సహోదరులమై యున్నాము. యేసు ప్రభువు శిరస్సత్వము క్రింద యుండి అందరము సమాజముగా కూడుచున్నాము. దేవుని సేవకొరకై అహరోను ప్రధాన యాజకునిగా ప్రత్యేకింపబడెను. దానికై ప్రత్యేకముగా సిద్ధపరచబడిన అభిషేక తైలము అతని తలమీద పూర్తిగా పోయబడెను. అది అహరోను గడ్డము మీదుగా కారి అతని అంగీల అంచు వరకు దిగజారెను. యేసుక్రీస్తు ప్రభువు నందే దేవుని సంపూర్ణత నివసించుచున్నది. ఆయనే మన ప్రధాన యాజకుడు. పరిమితి లేని పరిశుద్ధాత్మ అభిషేకమును ఎడతెగక కలిగియున్నవాడు. ఆయన శిరస్సత్వము క్రింద యున్నప్పుడు ఆ అభిషేకము మన మీదికి కూడ వచ్చును. అప్పుడు సమాధాన బంధములో ఆత్మ కలిగించు ఐక్యతలో నిలిచియుందుము. దేవుని సంపూర్ణతను అనుభవించుటయే మన రక్షణ ఔన్నత్యములోని పదునాల్గవ మెట్టు.

మన జాతియందు గాని, కులగోత్రముల యందుగాని, విద్యాబుద్ధుల యందుగాని, ధనసంపదల యందు గాని మనము అతిశయింపకూడదు. విశ్వాసులందరితో గల ఐక్యతను విశ్వాసముతో కాపాడుకొనవలెను. అప్పుడే యేసు ప్రభువు యొక్క జీవము మనలో నుండి ధారళముగా ప్రవహించును. సంఘ నిర్మాణములో కూడ అనగా పరమ సీయోనులో పాలు పొందగలము. దేవుని సంపూర్ణతను అనుభవించునదియే ధన్యకరమైన సంఘము. సంఘమంతటిలో దేవుని ఆత్మ అంతకంతకు విస్తరించవలెను. నీవు ఒక చిన్న గుంపుకు మాత్రమే చెంది యుండిన యెడల, నీవు బహుగా ప్రయాసపడినను, దేవుని సంపూర్ణతలోని సహవాసమును పూర్తిగా అనుభవించలేవు.

# 15. ఆరాధన

సహ విశ్వాసులముగా దేవుని ఎడతెగక కొనియాడుచు, ఆరాధించుచున్నప్పుడు, ఆయనను సేవించి, ఘనపరచి మహిమ పరచుటకు నేర్చుకొనెదము (కీర్తన 134 : 1,2). దేవుడు మనలను రక్షించుటలోని ఆయన ఉద్దేశమును ఈ రీతిగా వెల్లడి చేయుదుము.

*

ఈ రీతిగా ఈ కీర్తనలన్నింటిలో ప్రభువును సేవించుటలో ఒక్కొక్క అడుగు పైకి వేయుచు వెళ్ళుచున్నాము. ఏదో బహుమానమును ఆశించి ముందుకు పోము కాని దేవుని సేవలో యున్న సంతోషమును బట్టియే ఒక్కొక్క అడుగు వేయుచు, వెళ్ళుదుము. ఈ పదిహేను కీర్తనల అనుభవము ప్రభువు మనకనుగ్రహించుగాక! యేసు ప్రభువు యొక్క శిరస్సత్వము క్రింద నిలిచియుండి, దేవుని సంపూర్ణతను అనుభవించు గొప్ప ఆధిక్యతను ప్రభువు దయచేయును గాక!